UNIVERSAL LIBRARY
OU_204412
UNIVERSAL LIBRARY

శ్రీ

# మాలతీమాల

ఇది

నాలుగంకముల నవ్యనాటకము

సరస్వతి బుక్

శ్రీపానుగంటి లక్ష్మీనరసింహారావుగారిచే

రచియింపఁబడినది.

[illegible]

సెల్లర్స్ అండ్ పబ్లిషర్స్.

మొదటికూర్పు 1000 ప్రతులు.

1929

సర్వస్వామ్యసంకలితము.] [వెల రు 1-0-0.

అద్దేపల్లి లక్ష్మణస్వామి నాయుడుగారిచే
సరస్వతీ విద్యున్ముద్రాక్షరశాలయందు ముద్రితము
**4877—1000—1929**

శ్రీ రామా!

# ఉపోద్ఘాతము

ఇది నాయిరువదవరూపకము. నన్నుఁ బోషించుచున్న శ్రీపీఠికాపురాస్థానమహారాజుగారి ప్రథమపుత్త్రుఁడగు చిరంజీవి శ్రీరాజా గంగాధరరామరావుగారి పరిణయమహోత్సవమునందుఁ బ్రదర్శింపఁబడుటకు దీనిని వ్రాసితిని. శ్రీమహారాజకుటుంబమునకు సర్వశ్రేయములను బ్రసాదింపుమని శ్రీరామచంద్రమూర్తిని బ్రార్థించుచున్నాను. దీనికి నాందీప్రస్తావనలు వ్రాసియిచ్చిన నామిత్త్రులగు బ్ర॥శ్రీ కూచి నరసింహముగారి కనేకనమస్కారము లర్పించుచున్నాను.

ఈగ్రంథమును శ్రీ మాయువరాజుగారికిఁ గృతి నొసఁగితిని.

పిఠాపురము
18—8—29

పా॥ ల॥ నరసింహారావు.

# అంకితము

కం. శ్రీధాముఁడు శ్రీరాముఁడు
బోధము నాయువును యశము । పుత్త్రులు కరిరా
డ్యాధములు మణులు శ్రీగం
గాధరరాముని కొసంగి । కాచుతఁ గరుణన్.

సీ. బ్రహ్మదేవుఁడు నీకుఁ । బరమాయువు నొసంగి,
రక్షించుఁగాక శ్రీ । రామరాయ!
సకలవిద్యల నిచ్చి । శారదాదేవి నిన్,
రక్షించుఁగాక శ్రీ । రామరాయ!
శ్రీవిష్ణుదేవుండు । స్థిరసౌఖ్యముల నిచ్చి,
రక్షించుఁగాత శ్రీ । రామరాయ!
భూరిసంపద లిచ్చి । శ్రీరమాదేవి నిన్,
రక్షించుఁగాక శ్రీ । రామరాయ!
ఈశ్వరుం డీశ్వరత్వంబు । లేనిమిదియును
బ్రకటదయ నిచ్చి రక్షించు । రామరాయ!
తరణిచంద్రులు భవ్య । వేదర్షులెల్ల
ప్రేమచే నిన్ను రక్షింత్రు । రామరాయ!

గీ. ఆంధ్రభోజుఁడౌ సూర్యరా । యక్షితీంద్రు
ప్రథమపుత్త్రుఁడ వౌ నీదు । పరిణయమున
నవ్యరచనలఁ జేసిన । నాటకమును
గృతిగనర్పింతు దయస్వీక । రింపుమయ్య!

లాపురము
16—8—29

పానుగంటి లక్ష్మీనరసింహారావు.

# ఈ నాటకమున వచ్చు పాత్రములు

## పురుషులు :

| | | |
|---|---|---|
| జగన్నాథప్రభుఁడు | ... | రామదుర్గాస్థానమహారాజు. |
| చంద్రశేఖరరావు | .. | యువరాజు. |
| వెంకన్న | ... | పురోహితుఁడు. |
| సూరయ్య, పేరయ్య | ... | విష్కంభములోని బ్రాహ్మణులు. |

## స్త్రీలు :

| | | |
|---|---|---|
| శ్రీమహాలక్ష్మి | ... | మహారాజు భార్య. |
| గుణవతి | ... | యువరాజు భార్య. |
| కురవక | ... | గుణవతి దాసి. |

శ్రీరామచంద్రా!

(నాంది)

ఉ. శ్రీలలితాంగవిభ్రమసు • శీలములందున మేలుబంతి యై
స్త్రీలకు; లాలసద్గుణవ • తీప్రథ నొప్పెడుచంద్రమౌళిప్రో
యాలు నిజేశుకంఠమున • నల్లవు డుంచినమంజుమాలతీ
మాలయొసంగుఁగావుత స • మస్త శుభంబులుమీకు వారికిన్!

(నాంద్యంతమున)

సూత్రధారుఁడు—నటీ! నటీ! నటీ! ఈమహోత్సవములసందడిలో నామాటయే వినఁబడుట లేదు కాఁబోలును!

(ప్రవేశించి)

నటి—సర్వనాటకపాత్రసూత్రము హస్తగతము చేసికొన్న మిమ్ముఁ దప్పించుకొని నే నెట్లు పోఁగలను? ఎంతసమ్మర్దములో నున్నను మీమాట నాకు వినఁబడ కెట్లుండఁగలదు?

గీ. కమ్రతమములు వ్యామోహ • కంబు లైన
వస్తురాసులు తనుఁ జుట్టు • వాటి యున్నఁ,
దాను దూరస్థమై యున్నఁ, • దప్పకుండఁ
జుంబకాకృష్టమై వచ్చుఁ • జుండినూచి!

సూ—ఆలాగుననా? చుంబకభాగ్యమే నాకు లభించునెడల, నీకుఁ గావలసిన దే మున్నది?

న—అసమయోచితము లైనహాస్యములు గట్టిపెట్టి నన్నుఁ బిలిచినపని యేదో సెలవిండు.

సూ—మూఁడుమాటలతోఁ జెప్పుచున్నాను విను. మహా వైభవముతో నిపుడు జరుగుచున్న శ్రీ యువరాజుగారి వైవాహికోత్సవములలో నాడుటకై సుప్రసిద్ధ కవివర్యు లగు పానుగంటి లక్ష్మీనరసింహారావుగా రొక చక్కని నాటిక వ్రాసినారు.

గీ. భూపతులతోడఁ గవులతో • బుధులతోడ
గాయకులతోడ నుద్యోగి • గణముతోడ
సహృదయులతోడ నొప్పునీ • సభయెదుటను
హృద్యముగ మన మది ప్రద • ర్శింపవలయు.

న—ఓహో! మాలతీమాలానాటికయా! దూరదృష్టితో ఆయేర్పాటులన్నియు మీ రిదివఱకే కావించినారు. ప్రదర్శనమునకు సర్వము సంసిద్ధమైయే యున్నది. కాని మీరు మూఁడుమాటలతోఁ జెప్పెదునన్న నాటికలోని ముఖ్య పాత్రములును మూఁడేసుండీ! అంత యల్పసంఖ్యగల పాత్రములతో నుపరూపక మెంతసరసముగాఁ గవి రచించినాఁడు!

సూ—కుశలురా లగుగృహిణి యొక్క ఖర్జూరఫలసామగ్రితో మూఁడువందలయిఱువదిరకముల భిన్నరుచ్యపదార్థములు చేసి సంవత్సరముపొడుగునను దనకుటుంబమువారిని బరితుష్టి నొందింపఁగలదు—అనునొక యరబ్బీసామెత గలదఁట. రచననిపుణత పచననిపుణతపాటి గాకపోదు. ఇదివఱకే యిరువదిప్రశస్తనాటకములు వ్రాసి ఖ్యాతి గడించుకొన్న మేధావికి మూఁడుపాత్రములతో ముద్దులొల్కు నాటిక వ్రాయుట యొకపెద్దపని గాదు.

గీ. రెండుమూడుభూతమ్ముల • నుండి బుద్ధి
నెంతయోసృష్టి స్రష్ట క • ల్పించునట్లు,
కొలఁది యాధారములతోడ • గొప్పబుద్ధిఁ
జిత్రకావ్యంబుఁ గవిరాజు • సేయఁగలఁడు.

న—ఔ నార్యపుత్రా ! గ్రంథము శృంగారరసప్రధాన మైన చిన్ననాటకమే కాని, యది పూతభక్తిసమేత మై సద్ధర్మబోధక మై లలితోపమానకలిత మై నడుమనడుమ మర్మవాక్యములతో నొప్పారుచు మిక్కిలి మనోజ్ఞముగా నున్నది.

సూ—ఉత్తములు జననీజనకులైన మనయువరాజుగారికిఁ బరిణయసమయమునఁ గవి యీనాటికారూప మైన కాన్కయాశీఃపూర్వకముగా సమర్పింపఁ దలఁచినాఁడు.

న—శుభమస్తు!

గీ. మొగ్గ జనకావనీరుహా • మోదగరిమ
కానిపించెడికైవడిఁ • గన్న వారి
వంశముల సద్గుణములు గ • న్పడుచునున్న
వార! యీమనయువరాజు • గారియందు.

సూ—కనుక నంతశ్శుద్ధితో ననంతకల్యాణగుణమూర్తి నంతరంగమున నిడికొని తచ్ఛ్రేయోభిలాషుల మగుమన మిట్లాశీర్వదింతము.

సీ. తల్లియుఁ దండ్రి న • త్తయు మామయును మెచ్చి
దీవించునట్లు వ • ర్తించునేర్పు,

రాజనఁ దనప్రజ • రంజించువాఁడన్న
పలుకులందున దృఢ • ప్రత్యయంబు,
సత్యదయాదాన • శౌచాదిసంస్తుత్య
సద్ధర్మవినిబద్ధ • బుద్ధిగరిమ,
పూర్ణాయురారోగ్య • పుష్కలవిత్తవై
భవయుక్తమైనట్టి • భవ్యకీర్తి,

గీ. సౌభాగ్యసంతాన, మూర్తావ • నోత్సుకతయు,
దైవభక్తియు, యువరాజ • దంపతులకు
శ్రీరమారమణుఁడుఁ జంద్ర • శేఖరుండు
నురుకృప నొసంగి రక్షించు • చుండ్రు గాత!

న—తథాస్తు! తథాస్తు! తథాస్తు!

(తెరలో—శ్రీ రమారమణీమణీరమణా! —యను పాట వినఁబడును.)

సూ—అదిగో! గుణవతీదేవి యిప్పుడే భక్తిగీతములు పాడు కొనుచున్నది. నాటకము ప్రారంభించినారు కాఁబోలును. మన మిఁకఁ బోవుదము రమ్ము.

(ఇద్దఱు నిష్క్రమింతురు.)

పిఠాపురము
17—8—1929

కూచి నరసింహము.

శ్రీ

# మాలతీమాల

## ప్రథమాంకము

ప్రదేశము—రామదుర్గమున నొక క్షత్రియునియిల్లు.

ప్రవేశము—ఇంటిలో గుణవతి పాడుచున్నది. ఆమె గానము పైకి వినఁబడుచున్నది. ఆమె మాత్రము కనఁబడకుండ నున్నది.

కాంభోజి—ఆది

శ్రీ రమారమణీమణీ రమణ-శ్రితజనావన-శ్రీరమా.

(మఱియొకసారి యదియె పాడును.

చంద్రశేఖరరావు ప్రవేశించును.)

ఆ. వె. కమలసౌరభంబు । గాంచి భృంగము దాని
వెదకుకొనుచువచ్చు । విధము గాఁగఁ
బాడునట్టివారి । పాట నవ్వల విని
వారిచేరువకును । వచ్చినాఁడ.

(లోపల)

శ్రీరమారమణీమణీరమణ - శ్రితజనావన-శ్రీరమా.

చంద్ర—ఆహాహా! గాన మత్యంత రమణీయమై యున్నది.

ఆ. వె. పాటలోని తేనె । వర్షంపుమధురిమ
గాలికెల్ల తీపి । గలుగఁజేసెఁ
దుహినకరునిమంచు । తుంపర వ్యాపించి
దిశలకెల్లఁ జలువఁ । దెచ్చునట్లు.

(లోపల)

భూరికరుణాంభోధి వగునీ-పేరిదైనను నోటఁబలుకక
వారువీరనియంగలార్చుచు-భ్రాంతితోఁబలుపాట్లుపడితిమి-
శ్రీరమా.

చంద్ర—ఈ యింటి యుద్యానవనములోనివే కాఁబోలు, సంపఁగెలు గులాబులు తమపరీమళమును గాలిలో మొఱయుచున్నగానములోఁ జేర్చినవి. చేర్పవా?

తే. గీ. బలముగలవాని గుణములఁ । బట్టి యన్య
లబలులగువారు వానినే । యనుసరింత్రు;
కాన భూపుఁడు సద్గుణ । కలితుఁడగుట
వలయు నెప్పుడు లోక । లాభంబుకొఱకు.

జీవయుతములె కాక ని । ర్జీవములును
గానసంబంధగరిమచేఁ । గరఁగుచుండ
శ్రీమహారాజపుత్త్రుఁడఁ । జిన్నవాఁడ
నేను గరఁగుటలో వింత । యేమికలదు?

(లోపల)

ఏదిచూచిన నీవెమదిలోఁ-బాదుకొనుటకు సృష్టిచేయఁగ

నీదుమూర్తిని జూడఁ గన్నులు-నేరకున్నవి యేమొనర్తుము
శ్రీరమా.

చంద్ర—ఇదివఱ కెవరు పాడుచున్నారో యనుచింత కలుగ లేదు. ఏచింతకలుగుటకైన మనస్సున కిప్పటివఱకు స్వాధీనతయేది? అనుభవమునకు వశుఁడనైన కాలమున విమర్శన కవకాశ మేది? ఇప్పు డాచింత కలిగినది. కలుగదా?

తే. గీ. సరసకవివరుకావ్యంబు । చదువుచుండ
నతనిరం గేదొ పొడుగైన ¦ యతఁడొ కాక
పొట్టివాఁడో తెలియుంగ । బుద్ధిపొడము
నైజమగుఁ గాదె యిదికూడ । నైజ మటులె.
గానమును చిత్రకళ యాఁదు । దానిసొమ్ము
కాన నాఁడుదియే గాన । కలనఁ జేసెఁ
బాటకునుగూడ నామె స్త్రీ । త్వంబు గలిగెఁ
బురుషరాగవిశేషసం । స్ఫూర్తివలన.

ఆమె కంఠరవము—

కమ్రవీణారవముకంటెఁ । గమ్రతరము
సున్నితంబును జీవసం । స్ఫూర్తియుతము
వీణయును జీవసంస్ఫూర్తి । విశదమయ్యుఁ
గృత్రిమం బద్ది సహజమా । నిద్ది కాదె?

ఆహాహా! ఆమూలాగ్రమధురమై—

కన్నులకుఁ జల్వ చెవులకుఁ । గమ్రతయును
శ్వాసనంస్తంభనమున నా । సకును బలిమి

గాత్రమున రోమహర్షణ । కలన మఱియు
మనసునకుఁ దాండవంబు నా । త్మకును శాంతి
సర్వరోగసంహారణము । జనుల కిచ్చు
గానకళ సర్వకళలలో । మానితంబు.
అనుభవమునకు బుద్ధియే । యనవసరము
అట్టికళ కేను మ్రొక్కుదు • ననవతరము.

(లోపల)

నిన్నుఁ గాంచుచు నిన్నుఁ బలుకుచు-నిన్ను వేఁడుచు
నిన్నుఁ బాడుచు
నిన్ను నిశ్చలభక్తిఁ గొల్చుచు-నిత్యశుభముల నొందఁగల
మిఁక-శ్రీరమా.

చంద్ర—తథాస్తు. నీతో పాటు నేనును.

తే. గీ. దాక్షిణాత్యనిపాటకు । డాడపట్టు
నెలవు కంఠము తురకపా । టలకుఁ దలఁచు
ప్రకటకర్నాటగానంబు । నకును నాభి
కవులపాటకు మనసు భ । క్తమణి కాత్మ.

ఈమె పాటనుబట్టి యీమె భక్త్యంకురహృదయ యని యనుకొనుచున్నాను. కాని యీమెభక్తినిబట్టి పెద్దదియేమో యని తలఁపఁదగదు. కంఠరవమునందలి పీలతనముచే-మృదులతచేఁ- బాడుచున్నప్పుడూపిరి తిన్నఁగఁ బట్టలేకపోవుటచేఁ బిల్లయని స్పష్టముగఁ దెలియుచున్నది. మఱింతపిల్ల యేమో?

ఎట్లు తెలియవచ్చును? పిల్ల కాదు. నాకుఁ దగినయీడుకలదే యనుకొందము. ఐన నేమి? సౌందర్యవతి యగునో కాదో? అందునుగూర్చి పెద్దసందేహ మున్నది.

తే. గీ. శ్రీకి నెలవై నకేకిని । కేక రోఁత
పై కసహ్యమౌకోకిల । పాట తీపి
గాత్రసౌష్ఠవవతి ఖర । కంఠ యగుట
యట్లకుండ సుధాకంఠ । యగుట కలదు.

ఈసందేహము బలముగా నున్నది. ఏమో! ఒకసందేహముమాత్రము బలముగా లేదా యేమి? ఈమె సుక్షత్రియ యగునో కాదో సందేహమా? ఈమె నా కనురూపవయస్క యగునో కాదో సందేహమా? ఈమె లావణ్యవతి యగునో కాదో సందేహమా? ఈమె నన్ను వరించునో లేదో మఱియొకసందేహమా? ఏమైన నేమి? యథార్థ మేమనఁగా నేనామెకంఠమును వలచితిని. అందుకొఱకైన నామె నుద్వాహమాడవలసినదే. మిగిలినసులక్షణము లన్నియు నుండునా మఱింతమంచిది. పెండ్లికూఁతును జూడకుండ నిట్లు వలచినవారు నేనేకాని మఱియెవ్వరును లేరా? అట్టిది సహజమే కానియెడల నాకుమాత్ర మట్టిమనఃపరిణామ మేల కలిగియుండును? నలుఁడు దమయంతిని జూచియే వలచినాఁడా?

ఆ. వె. మొదటిచూపునందె । మోహాధికతఁ జెంది
మరగువలపె యుత్తి । మం బఁటండ్రు

కాని చూడకుండ । గాఢరాగాంబుధిఁ
గ్రాలువలపు దాని । కంటె ఘనము.

తే. గీ. అమలవిజ్ఞానపేటిక • కలులు రెండు
మొదటియది యింద్రియజ్ఞాన । సదనమగు; ద్వి
తీయము స్వయంభవం బైన । తెలివికిరవు
దానఁ బుట్టినప్రేమంబె । దైవికంబు.

ఏమో! ఈమాట యెంతనిజమో!

ఆ. వె. నాటకంబు లెన్నొ । నవలల నెన్నియో
సద్విమర్శమునను । జదివినాఁడఁ
గాని జగతినాట । కమున నాయకపాత్రఁ
బూని యాడు టిదియె । మొదలు మాకు.

మనుజబుద్ధిచే నూహింప నన్నియు సందేహములే. ఒక్క గబ్బిలమునకుఁ జెట్టు తావిచ్చినయెడల నాకులు గనపడకుండ నన్నియు గబ్బిలములే. సర్వకార్యములకు దేవునియందే భారముంపవలసినది. లక్ష్మీనారాయణులవలెఁ బరమపవిత్రులైన నాతల్లిదండ్రులు నాకు మిగులఁ జిన్నతనమునుండియు భగవద్ధ్యానప్రాబల్యము బోధించుటయేకాక వారితో పాటు నన్నాచరింపఁజేసినారు. దేవునిదయ యుండునెడలఁ బిల్లదనుకొనినదియే పెద్దది కాఁగూడదా? కురూపయేమో యని సందేహించినది సురూపకాఁగూడదా? భగవదిచ్ఛయే జరుగుఁగాక! అదికాక నా కనర్హమైనవస్తువుపై నాకు వాంఛ

యెన్నడైనఁ గలిగెనా? దైవకృపచే నిర్మలాంతఃకరణముతోఁ బ్రవర్తించునా కిప్పు డనర్థవాంఛ కలుగునా? చూతముకాక. పాట యాఁగిపోయినది. ఎంతసే పిచ్చట నుండవలయును? ఈ యింటియొద్దఁ గేకవైచి యీయి ల్లెవరిదో మొదలగునంగతులు కనుఁగొనవచ్చును; గాని యట్లొనగుట మంచిప్రవర్తనమునకు లక్షణము గాదు. తెలియవలసినప్పుడు తెలియును గాని పనికట్టుకొని పిలిచి యితరులసంగతులు తెలిసికొనుట తగదు. ఇంటివారి నడుగుట తగదు. పొరుగిండ్లవారి నడుగుట యంతకంటెఁ దగదు. మఱియొకప్పుడు రావచ్చును. కాని, దైవికముగ, నెవ్వరో యీవలికి వచ్చుచున్నారు.

(కురవక ప్రవేశించును)

కుర—అయ్యా! మీ రెవరు?

చంద్ర—నే నెవ్వఁడనో యిప్పుడే చెప్పెదనుగాని ముం దిది చెప్పుము. ఇంతసేపును లోపలఁ బాడినది నీవు కావుగదా!

కుర—అయ్యా! మే మట్టియాటపాటలవారము కామయ్యా! ఆజాతి వేరు. మే మెంతసేపు రాణులకొలువులో నుండుట, రాజులయొఱగులు దిద్దుట, రాజులకు రాణులకు భిన్నాభిప్రాయములు కలిగినప్పుడు సఖ్యమొనర్చుట- ఇట్టివే మా పనులు. కానిరాచబాట కెక్కియో, రచ్చచావడి కెక్కియో బుగ్గమీఁదఁ జేయివైచుకొని కన్నులు, తుంట్లు త్రిప్పుకొనుచు "చిన్నదానరా" యని పాడుచునాడువారము కామయ్యా!

చంద్ర—(తనలో) ఇది వ్యభిచారిణి యయ్యును వేశ్యలఅంతు పాటలు నడువీధినాట్యములు దనకు లేవని తన్ను శ్లాఘిం చుకొనుచు వారిని నిందించుచున్నది.

గీ. అన్యు లధములు తనకంటె । నంచు నెంచి,
యితరులను దిట్టి తన్ను శ్లా । ఘించుకొనుట
కంటె మనుజుఁడు తనకంటె । ఘనుల నుతులొ
నర్చి తను దిద్దుకొనుటయె । న్యాయ మగును.

ఆహా! ఇది రాణివాసమని తెలిసినది- ఒక్క సందేహము వదలినది. (ప్రకాశముగా) అంతఃపురపరిచారికా! నీవు న న్నెవరని యెందుల కడిగితివి?

కుర—అట్లడుగుట తప్పా? మీరు కొంత సేపటినుండియు నీరాజగృహమునెదుట నిలువఁబడి యున్నారు. నేను మిమ్ము సందుసందులఁ గనిపట్టుచునే యున్నాను. అసుర సంధ్యవేళ మీ రిక్కడఁ బనిలేకుండ నిలువఁబడి యీ యింటివంకఁ జూచుచుండునప్పుడు నా కనుమానము కలు గుట తప్పా? మొన్న రాత్రియే కాదా పెద్దదివాణములో దొంగలుపడినారు.

చంద్ర—(తనలో)హాఁ! ఎంత దొర యైననేమి? పర రాజ్యమున దొంగయని తలఁపఁబడుట వింతకాదు. (ప్రకాశముగా) నేను విద్యాపరిపూర్తికై దేశాటన మొనర్చుచున్నాను. ఈగ్రామ మిప్పుడే వచ్చినాను. భటులను బసలో నుంచి

యూరుచూడ నిటు తిరుగుచున్నాను. ఇక్కడకు రాఁగనే యమృతప్రవాహమైనయొకగానము నాచెవినిబడి నన్ను స్తంభింపఁజేసినది.

కు—బాబూ! మాభర్తృదారిక పాటవంటిపాటమాత్రము స్వర్గలోకమునన్నైన నుండదు. నాకుఁ బాట యనఁగ నేమియో తెలియదు కాని యామె పాడుచున్నప్పుడు మాత్రము నా కేలాగో యుండును. ఏదో బెంగపడిన ట్లొకప్పుడు-కడుపులో నాఁకలివేసిన ట్లొకప్పుడు-గొంగళి పురుగు మీఁదఁ బ్రాకిన ట్లొకప్పు డుండును. నల్లమందు పట్టుతప్పినప్పు డావులింతలు వచ్చిన ట్లొకప్పు డుండును. ఆవికారము లన్నియు నేను జెప్పఁజాలను. నేను వయస్సుచేఁ బెద్దదాననైనను, జిన్నరాణిగారికి నాయందే పంచప్రాణములు. ఆమెప్రాయమునకుఁ దగిన పదునాఱు పదునెనిమిదేండ్లకుఱ్ఱదాసు లున్నారు. కాని యొక్కతె బుద్ధియైన మంచిదికాదు. (అటునిటు చూచి) ఎవ్వరును లేరులే. అట్టె వచ్చి బీరువాలో మిఠాయిపొట్లమొడిలోఁ బెట్టుకొని, యిట్టె వచ్చి పళ్ళెరములో నున్నరెండు బత్తాయిపండ్లు పైఁటమాటున దాఁచికొని, యిటుతిరిగి యటుతిరిగి, వానినిజూచి యిగిలించి, వీనినిజూచి సకిలించి, మిట్టిమిట్టిపడుచున్న యీకుఱ్ఱదాసులను జూడఁగ మాచిన్నరాణిగారి కసహ్యమయ్యా! కంటిలోఁ గలిక మంతయుసత్యమైన నరే-ఆమెయొద్దఁ బనికిరాదు. అయిన

యింటిదాన నని, యసత్యమాడ నని, యుదయముననే పూజ చేసికొందు నని ప్రతిశనివారము రాత్రి ఫలాహారము చేసెద నని, యెఱిఁగియుండి యిచ్చినదేకాని చాటుమాటున బంగారపురాశినైనఁ బేడకుప్పవలె ముట్టనిదాన నని, తల్లిగారియరణపుదాసి నని నామీఁద గుణవతమ్మగారి కెంతియైనవిశ్వాసము. ఇందిరా యని చంద్రరేఖా యని మండూకముఖులు మర్కటచేష్ట లగునీకుఱ్ఱముండల నెప్పుడుకూడఁ బిలువదుసుమా ! ఎంతసేపు కురవకా కురవకా యని నన్నే పిలువవలయును. మా చిన్నమ్మ కెప్పుడు పెండ్లియగునా ? ఎప్పుడు మాదరిద్రత తొలఁగిపోవునా యని ప్రతిదినము నూడుగులమ్మకు మ్రొక్కుకొనుచున్నాను. ఆమెతండ్రి దస్తుశిస్తుల వంకఁ బెట్టుకొని యేదో తగిన సంబంధమును జూచుటకు మొన్ననే వెళ్లినాఁడు.

చంద్ర—(తనలో) పుణ్యాత్మురాలా! నేనడుగఁదగినవినా కేమియు మిగుల్పకుండ నన్నియు నొక్క విసరులోఁ జెప్పితివే! ఆహా! మనుష్యప్రకృతు లెంతచిత్రము లైనవో! ఈమె నన్నెంతమాత్ర మెఱుఁగదు. మొదట నేను దొంగనని కూడ సందేహించినది. అట్టియీమె యంతఃపురరహస్యములే కాక, దాసులరహస్యములే కాక, భూతభవిష్యద్వర్తమానస్థితులతోఁ, బేళ్ళతో, రూపములతో, వయస్సులతో, స్వభావములతో నన్నియు నొక్కయూఁపులోఁ

జెప్పివైచినది. ఈమెకుఁ జెప్పవలయునన్న సంకల్పముండి చెప్పినదా? నేను నమ్మను. ఈమె మనస్సునకుఁ బట్టు లేదు.

తే. గీ. పారిజాతమహీజము । పట్టులేమి
తెలివిలేకుండఁ బూవులఁ । ద్రిమ్మరించు
కంఠకంపముగలవారి । గానమందుఁ
దలపకుండనె సంగతు । లొలుకుచుండు.

స్త్రీలుపురుషులు కొందఱ । తీరువారు
మాటు, బిగియింపు, మీఁటయు । మదుల లేవు
చేరినదియెల్ల క్రిందికి । జాఱిపోవు
జలము కొంతైన నిల్చునే । జల్లెడందు?

ఇట్టివారికి సరుఁ డెవ్వఁ । డేని గంటఁ
బడినయెడఁ బోవనీయక । పట్టి యమ్మ
బాల్యమునఁబోయుదొండాకు । పసరుతోడ
నతని మొగమునఁ గ్రక్కుపా । మ్మందు రకట!

ఇట్టితప్పైన నాకు లా । భించె నిపుడు
తప్పు లుండకతీఱదు । ధరణిలోన
నొప్పులకుఁ దప్పులిచ్చెడు । గొప్పకాంతి,
హీరములకు డాకులునైన । నీయలేవు.

(ప్రకాశముగ) కురవకా! నీమాటలవలన మహానంద మైనది.

(నేపథ్యమున) కురవకా! అక్కడ నేమి చేయుచున్నావు?

కుర—ఆమాటలాడినవారే మాగుణవతమ్మగారు. ఒక్కనిముసము కనఁబడకుండునెడల "కురవకా! కురవకా!" యని పిలుచునని చెప్పితిని. నీకు నిదర్శనమైనదికదా! అమ్మా! ఏమియు లేదు.

(నేపథ్యమున) ఎవ్వరితో నక్కడ మాటలాడుచున్నావు?

కుర—ఎవ్వరితోడను లేదమ్మా! దృష్టిమాంద్యముచే-బుద్ధిమాంద్యముచే-సందెచీఁకటిగావునఁ దేజోమాంద్యముచే-నీస్వరూపము విస్పష్టముగఁ జూడలేను. బాబూ! ఎంత చక్కనివాఁడవు! నాకన్నె తెకపుదినములలో నీవంటివాఁడుండినయెడల నాయువశిష్టము మఱియొకనిచేఁ దీర్పించుకొనియుందునా?

చంద్ర—అసందర్భప్రలాపము లాడకు.

కుర—ముసలితనమును జిగురింపఁజేయఁగల సౌందర్యముకలవాఁడవని యంటిని. తప్పు లేదయ్యా! వట్టికసుగాయతనముగావున నొక్కటే వినుకుకాని-స్తుతి యేదో నిందయేదో యింకఁ దెలియనివాఁడవు. మఱియొక్కసారి చూడనీ. మీరు క్షత్రియులైన ట్లగపడుచున్నది కావున నిశ్చయముగా మాగుణవతమ్మకుఁ దగిన ట్లున్నారు. బాబూ! ఉప్పుకారము సరిగఁబడిన గోఁగుగూరపచ్చడిలాగున మీదాంపత్యము మిక్కిలి యనుకూలముగా నుండును.

గుణ—(నేపథ్యమున) ఎన్ని సారులు పిలిచినను లోపలికి రాక యక్కడ నేమిచేయుచున్నావు? (రంగమునఁ బ్రవేశించి చంద్రశేఖరరావును జూచి యదరిపడి లోనికిఁ బోవును.)

చంద్ర.—ఆ—హా—హా! (కొంతసేవు స్తంభించి యూరకుండును.)

కుర—ఆమెయే గుణవతమ్మ. నేఁ జేసిన చమత్కారమును జూచితివా? నీ కామెను గనఁబఱుపవలయు ననియే యెన్నిమాఱులు పిలిచినను లోనికి వెళ్లలేదు. బాబూ! నేను వచ్చువఱ కిక్కడనే యుండుము.

(కురవక నిష్క్రమించును.)

చంద్ర—ఆహాహా!

తే. గీ. కాంతిరంగ త్తరంగంబు । గప్పుమనుచు
నుప్పెననుబోలెఁ గ్రమ్మఁగ । నోర్వలేక
హృదయ మూర్ఛిక ముగఁ బై । కెగిరిపోయి
యట్టె యుమనస్క వేదాంతి । యట్టులైతి.

ఆ. వె. తెలుపుచాటునుండి । తళుకుతళుక్కని
యిట్టె వచ్చి మెఱసి । యట్టె పోవు
తోయదంబు వదలి । తొంగిచూచుచు లోని
కేగు చంద్రరేఖ । నీసడించి.

కాంతిరాశి గ్రమ్మ । కనులు చీఁకట్లయి
గుండ్రనైనమొగము । గోలమొగము

తెలియకుంటి మింటఁ । దళుకంచు మెఱసిన
మెఱుపువంక లెన్నొ । యెఱుఁగఁ దరమె?

కాని,

తే. గీ. ఆస్య తేజముకంటె హె । చ్చైనకనుల
కాంతి మూఁతలఁబడిన నా । కన్ను ఱెప్ప
లందు దూరి లోపల మది । నాక్రమించి
యచట వెన్నెలగాచిన । యట్ల తోఁచె.
పూర్ణ సౌందర్యధుర్యమా । పొలఁతిమోము
వాంఛలేకుండఁ జూచిన । భాగ్యశాలి
తనదులో వెల్గునరిజేరు । ధన్యతరుఁడు
అదె పరబ్రహ్మముదమున । కడుగుమెట్టు.

(నేపథ్యమున) బాబూ! అక్కడ నున్నారు కాదా! ఇదిగో! వచ్చుచున్నాను.

(కురవక ప్రవేశించును.)

చంద్ర—నీవు మొదటిసారి వచ్చి యామెదర్శన మిప్పించితివి. రెండవసారి వచ్చితివికాన రెండవదర్శన మిప్పింతువా?

కుర—నేను జెప్పఁబోవుమాటలను వినుఁడు. ఆవచ్చినవా రెవరని యామె నన్నడిగినది. బాబూ! మీరెవ్వరో నాకుఁ దెలియదు కాదా? అందుచే నొక మహారాజ కుమారుఁ డమ్మాయని చిత్రమైనకల్పనచేసి చెప్పితిని.

చంద్ర—అందులకు నీకవిత్వ మక్కఱలేదు. యథార్థ మదియే. తరువాత—

కుర—చూచితిరా! మనలోమనమాట. నాకల్పనకు యథార్థమునకు నెంతసూటిగా సరిపోయినదో! ప్రకృతిజ్ఞానమనఁగా నిదియే. నామాత్రపుఁబ్రకృతిజ్ఞాన మిప్పటికవుల కున్నదా?

చంద్ర—కురవకా! అనవసరము లైనమాట లేల? నీవు సమర్థురాల వగుదువు. కాని తరువాత మీకేమిసంభాషణము జరిగెనో చెప్పవా?

కుర—ఆయనకుఁ బెండ్లి యైనదాయని నన్నడిగినది. ఆసంగతి కూడ నాకు స్పష్టముగాఁ దెలియదు. మాగుణవతమ్మకు మీరు సరిపోవుదురని నేను మీతో నింతకుముం దనఁగ మీ రేమియుఁ బలుకకపోవుటచేతఁ బెండ్లి కాలేదని నిశ్చయపఱచుకొని యట్లే యామెతోఁ జెప్పితిని. అతఁడు మనయింటియొద్ద నెందులకు నిలువఁబడెనే యని నన్నడిగినది. నీగానము వినుచుఁ గదలలేకపోయినాఁడమ్మా యని నే నంటిని. నాలో నొక్కగుణమైన నాతని నాకర్షింపఁ గలిగినదని సంతోషించితి నని యామె పలికినది.

చంద్ర—ఆహా! అట్లు పలికినదా? మహాసంతోషము.

తే. గీ. పాటయే కాదు మఱియు రూ । పంబుగూడ
నన్నుఁ బూర్తిగ నాకర్ష । ణం బొనర్చె
సురభిళతయును రూపసుం । దరతగల్గు
నమెరికనుసుందరిగులాబి । యట్టుగాఁగ.

కుర—కురవకా! ఆతఁడు నీకంటెకిఁ జక్కఁగా నున్నాఁడా యని నన్నడిగినది.

చంద్ర—ఆఁ! తనకంటెకిఁ జక్కఁగా లేనని యనుకొనలేదు గదా!

కుర—బాబూ! చిన్నపిల్లవాఁడవు. పెండ్లియాడుపిల్లహృదయము తెలిసికొనుటకు నీ కింక సమర్థత తక్కువ. అది ప్రకృతిపుస్తకపఠనమువలనఁ గలుగునుగాని పనికిమాలిన కవులగ్రంథములు చదివినందువలన రాదు. ఈకవులు వట్టి మోసగాండ్రు బాబూ! మీరు కవిని మాత్ర మెన్నఁడును నమ్మవలదు. ఒకకవిగాఁడు మాచెల్లెలి నెల దినములుంచుకొని—

చంద్ర—నామన స్సాందోళనపడుచుండఁగా నసవసరసంభాషణము లెందులకు? అడిగినదానికి టక్కుటక్కునఁ బ్రత్యుత్తరము చెప్పునెడల సంతోషింతును. నాసౌందర్య మామెమనస్సునకు నచ్చినట్లు నీకుఁ బూర్తిగ విశ్వాస మున్నదా?

తే. గీ. వ్యాకరణశాస్త్రమునకు సూ । త్రాళి కలదు
తర్కమీమాంసలకును సూ । త్రములు గలవు
గ్రహగతులశాస్త్రమునకు సూ । త్రములు గలవు
ధరణి వెలసినయెట్టితె । త్త్వమునకైన
ఋషులు సూత్రంబులను రచి । యించినారు
అంద తెఱఁగియునెఱుఁగని । సుందరతకు

నొక్కసూత్రమైనను బుట్టి । యుండలేదు
జాతిఁబట్టి కాలముఁబట్టి । స్థలముఁబట్టి
నాగరకతనుబట్టి జ । న్మమునుబట్టి
యవసరంబునుబట్టి రా । జాజ్ఞఁబట్టి
యది వెలయుఁగాన సందేహ । మందుచుంటి.

కుర—నీసౌందర్య మామెకు నచ్చియుండవచ్చును. నేను బ్రపంచానుభవ మున్నదానను గావున నన్నడిగినది. కాని సౌందర్యతత్వమునుగూర్చి నీవు చేసినయుపన్యాసము సమంజసముగ లేదు. నూతనపద్ధతుల ననుసరించి చదువుకొనుటవలన నిట్టితికమకజ్ఞానము కలుగుచున్నది. నాకొడుకునకుఁ జదువుకొనుటకుఁబూర్వము తొండకు బల్లికి భేదము తెలియును. ఇప్పుడు గాడిదకు గుఱ్ఱమునకు భేదము తెలియకుండనున్నాఁడు. మా గుణవతమ్మ గారిపెండ్లిలో బంధువుల కెవ్వరికైన నక్కఱకువచ్చునని నాల్గుతెల్లనిగుఱ్ఱములు మాచార కొన్నాఁడు. అమ్మా! ఇన్నిగాడిదలు కొన్నారే మని నాకొడుకన్నాఁడు. దాసి దాన నేమైననన్నయెడలఁ గోపపడకుఁడు. మీసౌందర్య తత్వోపన్యాస మట్లున్నది. గ్రుడ్డివాఁడుగూడఁ దడిమి సౌందర్యమును దెలిసికొనఁగలఁడని నాయభిప్రాయము.

చంద్ర—అందునుగూర్చి యందఱకుఁగూడ భేదాభిప్రాయము లున్నవని నేను జెప్పితినిగాదా? నీకు నాకు భేదాభిప్రాయము లుండుటలో వింతయేమి? దీనికేమి?

మీచిన్నరాణిని నేను బ్రత్యక్షముగ నెప్పుడు చూడ వచ్చును ?

కుర — అది మీరింతలో నట్లు కోరఁదగదు. కాని మీ కట్టి వాంఛయుండు నెడల నేను జెప్పినట్లు చేసెదరా ?

చంద్ర — వేరె నన్నడుగ నెందులకు? గురునిమాట మీరు శిష్యుఁ డుండవచ్చును. వైద్యుపలు కాదరింపనిరోగి యుండవచ్చును. కాని ప్రియాసమావేశమునకు సాహాయ్య పడుదాసి చెప్పినట్లుచేయనివాఁ డుండునా ?

కుర — ఇప్పుడు మామాట నందఱు వినువారే. ఈవిధేయత ముందుగూడ నుండవలయును. సరే దానికేమి? అంత వార మైనప్పుడుకదా! రేపురాత్రి యిటకు రండు. మాచిన్నరాణి యిక్కడకుఁ బదియడుగులదూరమున నున్న మహాలక్ష్మీయాలయమునకుఁ బోయి సేవించును. మీ రప్పు డక్కడఁ బరోక్షముగ నిలువఁబడి యామెను బ్రత్యక్షముగఁ జూడవచ్చును. ఆమెతో మీరు మాటాడఁ దగదు. మీ రటనున్న ట్లామెకు సందేహము కలుగఁ గూడదు. ఇప్పటి కిది నాయాలోచన. అప్పటిస్థితినిబట్టి చూచుకొనవచ్చును. నాకు సెలవు. నేను బోదును.

(నిష్క్రమించును.)

చంద్ర — రేపురాత్రి—ఇరువదినాల్గుగంటలవ్యవధి యున్నది. నిముస మొకగంటగాఁ గానఁబడుచున్నది. ఎట్లు? ఓ రాజగృహమా!

తే. గీ. జలధిగతమణితతికంటె । విలువచేత
నధిక మౌమణి నీయందు । నలరుచుండు
నామనోహారమున దాని । నాయకముగఁ
బెట్టుకొనుభాగ్య మెపుడు ల । భింపఁగలదొ?

గుణవతీ!

ఇంట నీ వుంటి; కనఁబడ । కుంటి వకట!
బాట నే నుంటి మిగుల సం । భ్రమముపడుచు
పద్మముకుళాంతరస్థ యౌ । భ్రమరికొఱకుఁ
బైపయిఁ బరిభ్రమించెడు । భ్రమరుకరణి.
ఇంట నీవుండ నిక్కొఱ । కింటివంకఁ
జూచుచును దాపమొందుచుఁ । జొక్కుచుంటి
చంద్రకళ మబ్బులోనఁ బ్ర । చ్ఛన్నగాఁగ
నీరదమువంకఁ గాంచు చ । కోరమట్లు.

నాచంద్రకళ రేపురాత్రి నాకు దర్శనమిచ్చినప్పుడు నేను దాపశాంతి నొందఁగలను.

తే. గీ. దేవపూజకు భక్తుఁ డే । తెంచియుండి
దేవళము మూసియుంటచేఁ । దిరిగి యింటి
కెట్లు వెనుకాడి వెనుకాడి । యేగు నట్లె
యింటి కేను బోవుచు । నుంటి నకట!

(నిష్క్రమించును.)

ఇది ప్రథమాంకము.

శ్రీ

# మాలతీమాల

## ద్వితీయాంకము

ప్రదేశము—గుణవతి యింటి సమీపము.

ప్రవేశము—కురవక.

కుర—మహారాజకుమారుఁ డింక రాలేదు. ఆతని కేమి? బంతియాటతోఁబాటు - ఫలహారముతోఁబాటు - చదువుకొనుటతోఁబాటు - చీట్లాటతోఁబాటు - ఆఁడుదానిపైఁ బ్రేమముకూడ నొక్కపద్దుగాని యందుపై నాధిక్యమేమైన నున్నదా? మగజన్మమెత్తినవానికెల్ల నిదే పద్ధతి. భోజనపుగొడవ ముందు - పొలఁతిచింత యటమీఁదను. కాని యాఁడుదాని కటులా? వరునిచింత ముందు-ప్రాణముచింత యామీఁదను. బ్రహ్మ యాఁడువాండ్రను సృష్టింపక మానఁడు. సృష్టించిన పిమ్మట వారికిఁ బ్రాయము రాకమానదు. వచ్చినపిమ్మటఁ బెండ్లికై దేవులాడక తప్పదు. పెండ్లికొడుకులయలక్ష్యతలు నాలస్యములు బిగియుటలు తప్పవు. మే మీసంఘర్షణమున నలుగుడుపడక తప్పదు. నామట్టునకునే నింతకాలము

నుండి యీయావృత్తిలో జయప్రదముగాఁ గొట్టికొనివచ్చు
చున్నానుగదా మగవాఁడు వలపువలన భోజనము మాను
కొనుటగాని, నిద్ర మానుకొనుటగాని నేను జూడలేదు.
ప్రాణప్రియా! నిన్నుఁ బాసి బ్రదుకఁగలనా యన్న
నోటితో నప్పుడే మూఁడుసోలల కోడిపలావును సమల
కుండనైన మ్రింగును. ప్రాణకాంతా! ఈరాత్రి నీవు
లేకుండ నెట్లుగడపుదునోయని కనులొత్తుకొనుచు నే
యుండును; గఱ్ఱునుని యుత్తరక్షణముననే గుఱ్ఱుతీయు
చుండును. మగవాఁ డాహారమునకేకాని యనురాగము
నకుఁ బనికివచ్చినవాఁడు కాఁడు. ఆతఁ డెట్లున్న నేమి?
ఆఁడువానికిఁ దప్పదు. ఆఁడుదానిని బూర్ణముగ వలతువు
గదా - దానిచుట్టుచుట్టు తిరుగుచుందువుకదా - ఆఁడు
దానిని నెత్తిపైఁ బెట్టుకొందువుకదా - యని శాసించి
శిక్షింపఁగల యాఁడుప్రభు విప్పు డెవరున్నారు? అట్టి
యుపకార మాఁడువారికి రుద్రమదేవిపాలనములోనే జరిగి
యుండవలసినది. ఇప్పటిపురుషప్రభువులు గొంద ఱెంత
సేపు తమయైశ్వర్యములు-తమయధికారములు చూచు
కొనుటయేకాని తాను తటస్థముగఁ గూరుచుండి యాఁడు
దానియధికారము చెల్లనీయవలయునన్నయౌచిత్య మున్న
వారుకారు. మగవాని కిది యొకయాటక్రింద సాగు
చున్నది. ఆఁడుది మగవాని నెదుర్కొనవలయును. చెవి
పట్టుకొని యూఁపి నోరెత్తనీయకుండునట్లు చేయవల

యును. ఇప్పటియాండువారు తమస్వాతంత్ర్యమునకై శాసనములమూలమున నేదో జరుగవలయునని యాందో ళనపడుచున్నారు; కాని మగవా రట్టి శాసనములు చేయనీయరు. ఇఁక యుద్ధమే ప్రతిక్రియ. ఒకొక్క కుటుంబ మొకయుద్ధరంగముగ నుండవలయును. అట్లు కొంతకాలము జరుగఁగ స్త్రీరాజ్యవిజయధ్వజము సింహళ ద్వీపమున నొక్కటి, కైలాసముననొక్కటి యెత్తఁగలము. ఆట్టిసుదినములు రావలయును. మహాప్రభూ! త్వరగ రావలయును.

(తొందరతోఁ జంద్రశేఖరరావు ప్రవేశించును)

చంద్ర—ఏమీ! ఏమీ! త్వరగ నేల రావలయును? గుణ వతి క్షేమముగ నున్నదా?

కుర—వచ్చితిరయ్యా! ఏమి క్షేమము? వెనుకటి సంతోషము - వెనుకటియుత్సాహము - వెనుకటినున శ్శాంతి యామెకు లేవు.

చంద్ర—నిన్నను బాగుగనే యుండెను గాదా? సంతోష ముగఁ బాడినది కదా! ఇప్పుడింతలో నేమి యస్వాస్థ్యముసిద్ధించినది?

కుర—బాబూ! మీరు నిన్నరాత్రియు నీయుదయమును భుజియించినారా?

చంద్ర—భుజియించితిని.

కుర—ఆమె యాకుపై నట్టి వ్రేలువేయలేదు. మూఁడు పులుసులు నైదిగురులు చేయించితిని. కోడిగ్రుడ్లట్టు పోయించితిని. ఆమె కిష్టమని మెంతిపెరుఁగులో నాతల కాయయంతనీరుల్లిపాయలముద్ద కలిపించితిని. ఆలాగున గిన్నెలపై దృష్టియైనఁబడలేదా? ఏమమ్మా! ఏమమ్మా! యని తల్లిగారు పదేపదే యడిగినది. మాటాడలేదు. నేను నెమ్మళముగ బుజ్జగించి యడిగితిని.

చంద్ర—నీ వడిగినప్పు డేమనినది?

కుర—నామనస్సున కేదో బెంగగానున్నదని యన్నది.

చంద్ర—మనస్సునకు బెంగయే కద! దేహమున కనారోగ్యమేమియు లేదు గద!

కుర—అ దేమిసంతుష్టి బాబూ! దేహముకంటె మనస్సు తక్కువయని మీయభిప్రాయమా?

చంద్ర—కురవకా! ఈస్థితిలో మనస్సునకు బెంగయుండుట సహజమే. పదునాలుగేండ్లకన్య - అత్యంతలావణ్యవతి - బంగారువంటిపెండ్లి ప్రాయమువచ్చినది - ఎవఁడు వచ్చునో! యెట్టివాఁడు వచ్చునో యని మనస్సున కాందోళనముగ నుండదా?

కుర—బాబూ! మిమ్ముఁగూర్చి యట్టియాందోళనము మీకుఁగూడ నున్నదా?

చంద్ర—ఉండ కేమి?

కుర—ఉన్న యెడల మీరు భుజియింపఁగలిగియుందురా బాబూ! రాత్రి మీకు నిద్ర బాగుగాఁ బట్టినదా?

చంద్ర—ఒకరీతిగా—కొంచెము కలఁతనిద్ర పట్టినది.

కుర—భోజన మెక్కువ యగుటచేత- నే నెఱుఁగుదునయ్యా! నన్నుంచినసువారవుదొర వట్టితిండిపోతు. శనివారము రాత్రి నేను జేసికొన్న మినుపరొట్టెలో సగము తానే తిని తెల్లవార్లు గుండెబరువుచేత దయ్యముపట్టినట్లు వెఱ్ఱి కేకలు వేసెడివాఁడు. నే నట్టెచదువుచున్నానని మీరు రోసరోసలాడుచున్నారు. మీ రింతయాలస్యముగ వచ్చితి రేల? బాబూ! మఱి యెక్కడనైనను గానము వినుచు నిలవఁబడలేదుగద!

చంద్ర—ఈవిషయమునఁ దప్పాడితివి. నీహృదయము ననుస రించి నీ వంటివి. నిన్ను క్షమించితిని. నాయాలస్యము మాట కేమి? మీ రీసరికి దేవాలయమునకుఁ బోవల సినవారుగదా! ఏల యాలసించుచున్నారు?

కుర—ఆ ప్రయత్నమున నుండియే మీ రింక రాలే దెందువల ననో యని యిటవచ్చి యల్లాడుచుంటిని.

చంద్ర—భుక్తి లేకపోవుటచేత నిద్ర లేకపోవుటచేత నామె నీరసస్థితి నున్నారేమో యీరాత్రి దేవాలయయాత్ర మానఁగూడదా?

కుర—బాబూ! ఐశ్వర్యములో భేదము - జాతిలో భేదము- వయస్సులో భేదము - అంతేకాని మనకు మనస్సులలో

నేమాత్రము భేదము లేదయ్యా! నేను నామెతో నటులే యంటిని. ఈరాత్రి మానినయెడల రేపురాత్రి యింత కంటె ననారోగ్యముగ నుండునేమో యెట్లు తెలయ వచ్చును? కాన మానవలదని యామె యన్నది.

చంద్ర—ఇప్పుడే బయలుదేరుదురా?

కుర—అభ్యంతర మేమి?

(నేపథ్యమున) కురవకా! అక్కడ నేమిచేయుచున్నావు?

కుర—వీధిలో నింకఁ గొంతసందడిగా నుంటచేతఁ జూచుచున్నానమ్మా! ఇప్పుడే వత్తునుబాబూ! మీరు ప్రచ్ఛన్నముగ నుండి యన్నియుఁ జూడుఁడు. అన్నియు వినుఁడు. అంతేకాని యామెయెదుటఁ బడవలదు.

చంద్ర—సరే.

కుర—(లోనికి నిష్క్రమించును.)

చంద్ర—(తనలో)

తే. గీ. చాతకము నోరు తెఱచి వ । ర్షంపునూత్న
బిందువునకయి మొగమెత్తి । వేఁచియుండు
నట్టులే యుంటి నిచ్చట । నామెకొఱకుఁ
జూడఁదగువస్తు వేదియో । చూచువాఁడ.
అట్టి మోద్పును జెందకుఁ । డక్షులార!
తటుకునను నిల్తువేమొ భ । ద్రంబు మనస!
ఇదియె జన్మసాఫల్యంబు । నెనయునదను
మీకు; జాగ్రత్స్వభావలై । మెలఁగవలయు.

(పూవులపళ్లెరము తీసికొని కురవక ముందు, గుణవతి వెనుకఁ బ్రవేశింతురు.)

కుర—అమ్మా! ఇటు. ఇటు.

చంద్ర—(తనలో)

తే. గీ. నల్లనౌదాసి ముందర । నడచుచుండ
విమలతేజస్విని యణి । వెనుక నేగు
నంధకారము ముందు ముం । దరుగుచుండ
దినకిరణకాంతితతి వెంబ । డించునట్లు.

కలువచెలికాడ! యామె ము । ఖంబుఁ గాంచి
సిగ్గుపడి మబ్బులోపలఁ । జేరె దేల?
పైకి రావయ్య! చీఁకటి । వలన నామె
పదము తొట్రిల్లు నకట! నా । హృదయమట్లు.

కుర—దేవాలయమునఁ బురుషు లెవ్వ రుండఁ గూడదు. అందఱు వాకిలికిఁ బొండు. (నేపథ్యమున) పూజరికూడఁ బోవలయునా?

కుర—పూజరిభార్యను దెచ్చి యాతని స్థానమున నిల్పుము.

గుణ—ఆమె కూడ నక్కఱలేదు. తలుపులు తెఱచియుంపుమని చెప్పుము.

కుర—పూజరిభార్యకూడ నుండనక్కఱలేదు. అందఱు పొండు. తలుపులు తెఱచిమాత్ర ముంపుఁడు.

చంద్ర—ఇప్పు డీప్రక్కనుండుటకు వీలులేకున్నది. ఎడమ వైపునుండి చూచెదను.

ఆహా! వింత.

తే. గీ. కాంతమొగమును గుడివైపు । గాంచునపుడు
కానఁబడినసౌందర్యంబు । కంటె నెడమ
వైపు చూచునప్పుడు గానఁ । బడెడునట్టి
సుందరత ఘనతరమాట । సూనృతంబు.

(వెనుకఁ దెరయెత్తఁగ మహాలక్ష్మిగుడి)

(కురవక గుణవతి దేవాలయపుముంగిలి చేరుదురు.)

చంద్ర—నే నెవ్వరికిఁ గానఁబడకుండ నిక్కడఁ బూలచెట్ల మాటున నుందును.

గుణ—కురవకా! నీచేతిలోని పళ్లెరములోనిపూలు నాచేతి కిమ్ము.

కుర—(ఇచ్చును.)

గుణ—(చేతిలోనిపూ లొక్కసారి మహాలక్ష్మిపైఁ జల్లి తల వంచి నమస్కరించును.)

చంద్ర—ఆహా!

తే. గీ. దాసి యొసఁగినమల్లెలు । తరుణిచేత
మంకెనలుగ మారెను; శ్రీర । మాభగవతి
యొడల నీలాంబరంబులై । యొప్పె నవియె;
వస్తురూప మాశ్రయమును । బట్టిమారు.

తే. గీ. శ్రోత్రియుఁడు వేశ్యయింటిలోఁ జొచ్చినపుడు
శిరముపైఁ గుచ్చుఁ గంటికి సురముఁ బెట్టు;
విటవరుండైన పార్వతీ విభునియెదుట
బూడిదను ఫాలపట్టికఁ బూసికొనును.

అదిగో!

కరపుటము మోమునను జేర్చి కాంత మ్రొక్కఁ
జంద్రసన్నిధిఁ బద్మముల్ సంకుచించె;
నాళయుగమున కొక మొగ్గ గ్రాలె నదిగో
నుభయతనువులకును బ్రాణ మొకటె యనఁగ.

కుర—తల్లీ! మహాలక్ష్మీ! మాభర్తృదారికను రక్షింపుము. ఆమె పవిత్రములైనవాంఛలు నీడేర్పుము. తల్లీ! మాయమ్మ కనుకూలుఁ డగువరుని బ్రసాదింపుము.

చంద్ర—కురవక నా పేరు చెప్పలే దేమి?

కుర—అమ్మా! మీకు యథేష్టముగఁ బ్రార్థించుకొనుఁడు. మీకడుపులో నున్న కష్టసుఖములన్నియు దేవికి నివేదించుకొనుఁడు. లోపల గొణఁగుకొనుచుఁ జేసినప్రార్థనలో కంటె బిగ్గఱగఁ జేసికొను ప్రార్థనములోఁ బటుత్వ మెక్కువ. నిశ్చలత్వ మెక్కువ. కాన నే నావలకిఁ బోవుదును.

(కురవక పోయి చంద్రశేఖరరావు దగ్గఱ నిల్వఁబడును.)

గుణ—తల్లీ! మాతల్లియొద్దనుగూడ సిగ్గువిడిచి చెప్పుకొనలేనిసంగతులు నీయొద్దఁ జెప్పుకొనుచున్నాను. నీవు లోక

మాతవు—సర్వస్వతంత్రురాలవు—జగత్పాలికవు. తల్లీ! ఆఁడుదాని హృదయమును నీవు పూర్తిగ నెఱుఁగుదువు కాదా? నీవు శ్రీకృష్ణమూర్తిని వలచినప్పు డాతనికై యెంత తహతహపడితివో నీకు జ్ఞప్తియం దుండకపోవునా? నీవు దేవతవు—నేను మనుష్యకాంతను. స్థితిభేదముగాని హృదయగతి యంతయు నొక్కటే కాదా? రక్షింపవా? తల్లీ!

చంద్ర—కురవకా! ప్రార్థన మెుండిగానున్న దేల?

కుర—వలచినవాని పేరు చెప్పలేదని యేనా? విందువు కాని—

గుణ—నిన్న సాయంకాలమున మా యింటియెదుట నొక సుందరస్వరూపుఁడు వచ్చి నాగానమును వినుచు నిలువఁబడినాఁడు. ఆతనిఁ డబ్బాటునఁ జూచి నీవు పురుషోత్తముని జూచి యెటులైతివో నే నటులైతిని.

చంద్ర—ఆహాహా! కర్ణములు ధన్యములైనవి. కురవకా! ఈమాత్రమున కీరాత్రి యింత శ్రమపడి దేవాలయమున కామెను దెచ్చు టెందులకు? ఇంతగాఁ బ్రార్థన లెందులకు? నన్ను రమ్మని యాజ్ఞాపించునెడల నేను మహానందమునఁ బరుగెత్తుకొని వత్తునే—మాతలిదండ్రుల సెలవడిగి వివాహము చేసికొందునే—చూడు కురవకా! ఇది మంచి సమయముగ నున్నది. రవంత యెదుటఁబడనా?

కుర—అయ్యయ్యో! వలదు. తా నిట్టిప్రార్థన చేసినట్లు నీవు వినియుంటివని యామెకుఁ దెలిసినయెడల నింకేమైన

నున్నదా? నేనైనను వినుట కామె కిష్టముండదని యెంచియే దూరమున నుందునని చెప్పి వెడలివచ్చితిని.

చంద్ర—మంచిమాట చెప్పితివినుమా! ఉత్సాహముచే నింతదూర మాలోచింపలేదు.

కుర—శృంగారసముద్రమును మథించినదానను నేను - ఇంక నొడ్డుమీఁదనే కూరుచుండినవాఁడవు నీవు. నీకు నాకు నెంతభేదమున్నది?

గుణ—అమ్మా! అతఁడు నన్నుఁ జేసికొనునట్లు కటాక్షింపుము. అతఁడేమో మహారాజపుత్త్రుఁ డఁట. మేము జమీందారులము. అతఁడు న న్నంగీకరించునో తిరస్కరించునో యని భయపడుచున్నాను.

చంద్ర—గుణవతీ! ఎంతమాటాడితివి! తిరస్కరింపను. తిరస్కరింపలేను. అంగీకరింపకమానను - అంగీకరించితిని. నీ కున్నతొందర నాకు లేదనుకొంటివా? నేను బురుషుఁడను, దృఢమనస్కుఁడను, గంభీరుఁడను గావున శాంతించుకొనుచున్నాను. అబలవుకావున నీ వాతొందరకు వశమగుచున్నావు. నీకు నాకు నున్నభేద మింతే. మా తండ్రిగారైనమహారాజును నీ వెఱుఁగకపోవుటచే హెచ్చు తగ్గులఁ బరిశీలింతురని సందేహించితివి. ఆయన నూటికి లక్షకు భేదమును జూడనివదాన్యచక్రవర్తి. ఆయనపుత్త్రుఁడను నేను. మేమే యట్టిహెచ్చుతగ్గులఁ జూతుమా? అది కాక - ధనముచే హెచ్చు హెచ్చా?

తే. గీ. ఎవనికరమున వితరణ । మెసఁగుచుండు
నట్టిమనుజుఁడె మిగులహే । చ్చైనవాఁడు
ఎవనినాల్కను సూనృత । మెసఁగుచుండు
నట్టియాతఁడె మిగులహే । చ్చైనవాఁడు
హృదయమున భూతకారుణ్య । మెవని కుండు
నతఁడె సర్వజనోత్కృష్టుఁ । డైనవాఁడు
ఎవనిమదిలోన శ్రీజగ । దీశుభక్తి
యుండు నాతఁడె సర్వలో । కోత్తరుండు.

అంతేకాని,

గోనెసంచులచేతను । గొప్పఁదనము
మట్టిచేతను సర్వోత్త । మత్వ మెట్లు?
ఇచట నుంటకుఁ గాదద్దుఁ । డచటి కేవఁడో
యతఁడె దేవతుల్యుండైన । యతఁడు సుమ్ము.

గుణ.—కురవకా! (గట్టిగ) కురవకా!

కుర—అమ్మా!

గుణ—అంతగట్టిగఁ బిలిచినఁగాని పలుకలేదేమి?

కుర—మీప్రార్థనలు నాచెవిని బడునేమోయని దూరమున నుంటినమ్మా!

గుణ—అమ్మవారిపీఠంబునఁ బడిననాల్గుపూల నిటు తెమ్ము.

కుర—(తెచ్చియిచ్చును).

గుణ—నీవుకూడఁ దీసికొనుము. (ఇచ్చును.)

కుర—అక్కడ నాచేరుమాలు తొందరలోఁ బడిపోయినది. తెచ్చుకొని వచ్చెదను.

చంద్ర—ఇఁక నేను బోవలసినదేనా? తిరుగ నెప్పుడు మన సమావేశము? అప్పుడైన నేను మాటలాడవచ్చునా? నీవు వలదన్నను నేను మానువాఁడనుగాను.

కుర—ఇదిగో! ఈరెండుపుష్పములు తీసికొనుము. నాచేయి చల్లనిది. రేపురాత్రి నీకామె యెన్నిపుష్పములైన నీయఁ గలదు. స్వయంవరదామముగూడ నీమెడలో నామె వేయునేమో? మీరు స్వేచ్ఛగా మాటలాడుకొన వచ్చును. ఆమెయుద్యానవనమునకు రేపురాత్రి తొమ్మిది గంటలకు రమ్ము.

చంద్ర—ఆకనఁబడునదేనా యుద్యానవనము?

కుర—ఔను. ఇఁక మేము పోవుదుము. మీరా ప్రక్క నుండుఁడు.

చంద్ర—సరే.

కుర—అమ్మా! దయచేయుఁడు.

గుణ—కురవకా! మనస్సేమొ తేలికగా నున్నది. ఇప్పుడు మునుపటియంతబెంగ లేదు. రవంతధైర్యము కలుగు చున్నది.

చంద్ర—కలుగదా?

తే. గీ. కాంచనం బగ్గిచేతను । గాంచు శుద్ధి
రసము పొందును బరిశుద్ధి । పసుపుచేత
వనదనీరము పటికచేఁ । బడయు శుద్ధి
ప్రవిమలత గాంచుహృదయంబు । ప్రార్థనమున.

కుర—మహాలక్ష్మి మీప్రార్థన మంగీకరించినందుల కిదియె నిదర్శనము. మీ కాయనతో వివాహ మగునెడల నేను మహాలక్ష్మికి నాగాజు లిచ్చెదనని మ్రొక్కుకొంటినమ్మా!

గుణ—ఒకజత యమ్మవారి కిచ్చెదవో నాల్గుజతలు నాయొద్ద నుండి పుచ్చుకొందువో నీ కేమి లోపమే? పోవుదము రమ్ము. కాని యాతఁ డీరాత్రి రాలే దెందువలననో?

కుర—ఏమో నా కెట్లు తెలియును? వచ్చియే యున్నాఁడేమో? మనకుఁ గానఁబడకుండ నెచ్చటనైన దాఁగియుండెనేమో? ఎవరు చెప్పఁగలరు?

గుణ—ఆలాగా? ఇక్కడ గాదు. ఇంటియొద్ద నింక మాట లాడుకొందము రమ్ము. (ఇద్దఱు నిష్క్రమింతురు.)

చంద్ర—ప్రాణప్రియ వెడలినదా?

గీ. కనఁబడకయున్నఁ దోఁచదు । కంటఁబడిన
నైనఁ దోఁచదు దుఃఖసౌ । ఖ్యములనొక్క
గతిమదిచలించు; భయమోహ । గతులయందు
సరిగ నూఁగు నూసరవెల్లి । శిరముపోలె.

మోము కోలదో గుండ్రనో । మొదట నెఱుఁగ.
గుండ్రనగుమోము; కానియా । గుండ్రతనము
నందుఁ గోలదనంబు । కానంత గలసె
నేమొ యనుశంక మమ్ము బా । ధించు నింక.

పట్టుమని దీక్షతోఁ జూడ । వలనుపడదు
దాపునకు నేగి చూడఁగాఁ । దప్పు; తెలియు
టెటు? మహారాట్సుతులకైన । నిట్టిదొంగ
తనము తప్పదు శృంగార । తంత్రమందు.

పలుచనిశలాకవంటిది । పొడుగయినదఁ
టంచు ననిపించుకొనును రెం । డబ్దములకుఁ
బిదప. మల్లెయుఁ గాదు సం । పెఁగయుఁ గాదు
అదియు నిదియును గలసిన । యట్టిరంగు.

కాని కన్నులసౌందర్యము మాత్రము చెప్పనలవికాదు.

సీ. కళుకులై వలరాజు । ములుకులై బెళుకులై,
పులకలెత్తించెడు । కలికిఁదనము
సోగలై నిగ్గులై । బాగులై సిగ్గులై,
మనసు నూఁపించెడు । మంజిమంబు
గొప్పలై చేరలై । యొప్పులై చేఁపలై,
దుముకుచుఁ జెలరేఁగు । దుడుకుఁదనము
చల్లనై శాంతమై । మెల్లనై స్వచ్ఛమై,
పూతతనొడఁగూర్చు । పుణ్యమహిమ

కలిగి శ్రీమహాలక్ష్మికి । నెలవులగుచుఁ
గరుణ కాలవాలములౌచుఁ । గాంతిరాశి
కిరవులై యమాయికములై । యొసఁగునామె
కన్నులను జూచుకన్నులు । కన్ను లహహా!

తొందరచూపుతోఁ గలిగినయర్ధపాండిత్యమున నాకుఁ దెలిసిన దింతే. ఉత్తమకవి కవితలోవలె సావకాశముగఁ జూచినకొలఁది విశేషము లగపడును. నే నింక శృంగారసరసియొద్దనే కూరుచుంటినని కురవక యధిక్షేపించినది. రేపురాత్రి యుద్యానవనమున నామెను దర్శించి మఱికొంత పాండిత్యము సంపాదింపఁగలను.

(నిష్క్రమించును.)

ఇది ద్వితీయాంకము.

శ్రీ

# మాలతీమాల

## తృతీయాంకము

ప్రదేశము—ఉద్యానవనమునఁ బుష్పనికుంజము.

ప్రవేశము—గుణవతి-కురవక.

గుణ—అతఁడుకూడ నన్ను వలచినట్లు నీకు నమ్మకమేకద!

కుర—ఎన్నిసారులు చెప్పుదును? తేనెమీఁదఁ దేనెటీఁగ వ్రాలదా? మల్లెపంచుకొంచునుఁ బోలుగపిట్ట యుల్లాట లూరదా? పాలమీఁద నిష్టములేనిపిల్లి యెచ్చటనైన నుండునా? బంగారపుబొమ్మవు. చక్కదనాలచుక్కవు. గుణాలకుప్పవు. నిన్నుఁ గాంచి వలపులఁబడనివాఁ డెవ్వఁడైన నుండునా? అందులో నాతఁడు విద్యావంతుఁడు, రసగ్రహణపారీణుఁడు. నిన్నుఁ జూచి యుబికి యుబికి యుప్పొంగిపోయినాఁడు. నీరూపము నీపాటయు నాతనిఁ బూర్తిగ నాకర్షించినవని నాతోఁ గంఠోక్తిగాఁ బలికినాఁడు. ఇంతకంటె నేమి కావలయును?

గుణ—అతఁడు మిక్కిలి చక్కనివాఁడేసుమా!

కుర—చక్కనివాఁడు కాకున్నయెడల మాయమ్మకు నచ్చును గాఁబోలు! అబ్బో! అందఱవంటివాఁడవా మాతల్లీ!

రవంత మొగము తీరు, కాసంత ముక్కుసొగసు గాంచి సరి పెట్టుకొనిపోవుదానవా? అమ్మయ్యో! కోహినూరు వజ్రమును మెచ్చుదానవేనా? పంచకల్యాణిగుఱ్ఱమును మెచ్చుకొనుదానవేనా? పాకపుగారెలు మెచ్చుకొనుదాన వేనా? ఓయబ్బ! ఎంతయెంతచూపులు! ఎంతెంత యూహాపోహలు! ఎంతసున్నితమైనరుచులు! ఎంతమంచి వస్తువైన నచ్చులే? నేను జిన్నతనమునుండి కనిపట్టి చూచుచుండుట లేదా? అమ్మా! నిన్నుఁ జిన్నతనమున నెత్తుకొనుట కేర్పాటుచేసినకుఱ్ఱవానికిఁ జింపిరితలయని దానిని ముట్టుకొనసిచ్చితివి కావే? ఓయమ్మ! మాయమ్మ కెంతచక్కనివాఁ డేసీమనుండి వచ్చునో యని యను కొంటిని. అట్టినీకు నచ్చినప్పు డాయయ్యసౌందర్యమునకు హద్దున్నదా? దయ్యపుటాఁకలిసి దీర్చినవైద్య మెంతయో చెప్పదరమా?

గుణ — అట్టి చదువకే. చూడు. నే నాయనను దిన్నఁగఁ జూడలేదుసుమా! నీవు బాగుగాఁ జూచితివి కావున నెట్లు న్నాఁడో వివరములతోఁ జెప్పెదవా?

కుర — నేను జదువుకొన్నదాననేకాని కవిత్వముజోలికిఁ బోయినదానను గాను. కవిత్వములో మరగినయెడలఁ గులవృత్తి సాపుగా జరుగదని యెంచి దానినిఁ దలఁపెట్టలేదు. రెండును మనోవికాసముతోఁ జేరినకళలే కావునఁ బద్య రచనకుఁ బడుచుకొనుటకుఁ గిట్టదు. కవిత్వముచెప్పువా

రండఱుఁ దిన్నగ స్త్రీపురుషవర్ణనలు చేయుచున్నారా? ఆఁడుదానిచెవులు శ్రీకారములవలె నున్నవని కవి వర్ణించినాఁడనుకో. అందువలనఁ జెవినిగూర్చి మనకుఁ గ్రొత్తగా నేమి తెలిసినది? శ్రీకారమును ముందు తెలిసికొనుట యెందులకు? అటుపైన దానినిబట్టి చెవులు తెలిసికొనుట యెందులకు? శ్రీకార మెట్లున్నదో తెలిసికొనువాఁడు ముందుగాఁ జెవి యెట్లున్నదోమాత్రము తెలిసికొనలేఁడా? ఈనస్తువర్ణన లేవియు సరియైనవి కావు. కావున వర్ణనల వలన స్వరూపము మనకుఁ దెలియునన్నయాస నాకు లేదు. ఎవరిమట్టునకువారు చూచుకొనవలసినది; ఆలోచించుకొనవలసినది; అంగీకరింపవలసినది కాని—

గుణ—చూడవలసినచ్చినప్పుడు చూడవచ్చును-కాని యంత వఱకు కాయనకన్నుముక్కుతీరు నీవు చెప్పఁగా వినుచుండినకాని నాకుఁ దోఁచునా? ఎంతసేపైనసరే యాతనిఁ దలఁచుకొనుచుండవలెను. ఎంతసేపైనసరే యాతనివిగ్రహము మనోనేత్రమున కెదుటఁ బెట్టుకొని పూజింపవలయును. నా కాయనవిగ్రహము స్ఫుటముగాఁ గానఁబడకుండ నున్నది. అందుచేత నాయన యెట్లుండునో నీవు చెప్పుము.

కుర—క్రిందటిసారి నీ వాయన నెంతవఱకుఁ జూచితివో చెప్పుము. అటుపైనఁ జెప్పెదను.

గుణ—ఎంతవఱకుఁ జూచుటయే మే నీమొగము. పిలువఁగనే నీవు పలుకలేదని నేను వాకిటిలోనికి వచ్చితిని. ఎదుట దివ్యమంగళవిగ్రహముఁ జూచితిని. నే నేమనుకొంటి నను కొన్నావు? పాలరాతిబొమ్మ యనుకొంటిని. అట్టె తెల్ల వోయి లోనికిఁ బోయితిని. ఇదంతయు నొక్క చెప్ప పాటులో జరిగినది. నీవు నాకంటె నదృష్టవతివి కావున నీ వాయనను సావకాశముగఁ జూచితివి. ఏమివిశేష ములు చూచితివో నాకుఁ జెప్పుమంటిని.

కుర—నేను గనిపట్టిన సంగతి యొక్కటి విను. ఆయన ముఖము నుండి కాంతిమంతములైన కిరణములు వెలువడుచుండును. చూచువారికన్నుల కాకిరణములు రవంత విభ్రమమును గలుగఁజేయును. దూరమునుండి చూచువారే కొంత విస్పష్టముగ నాయన మొగముఁ జూడఁగలరేమో కాని దగ్గర నున్నవారి కది కష్టము. ఆయనకన్నుముక్కుతీరును గూర్చి నాకుఁ దెలిసినది నీకుఁ దెలిసినదానికంటెఁ దక్కువ యేమోయని యనుకొనుచున్నాను. నే నాయ నతో నిదివఱకుఁ బ్రక్కనుండియే మాటలాడితిని గాని యెదురుగ నుండి మాటలాడలేదు.

గుణ—ఎప్పుడు నట్టికిరణములు ప్రసరించుచుండునప్పుడు మేము కలసియుండుట యేలాగు?

కుర—అ దేమిమాట? స్వాహాదేవి వైశ్వానరునితోఁ గాపురము చేయుచుండుట లేదా? ఛాయాదేవి సూర్యునితో సంసారముఁ జేయుచుండుట లేదా?

గుణ—నా కేమో తాపముగా నున్నది. ఒడలు వేఁడిగా నున్న దేమో చూడు.

కుర—(స్పృశించి) కొంచెము వేఁడిమిగానే యున్న దమ్మా!

గుణ—ఎందుచేతనో?

కుర—భోజనము లేదయ్యెను. నిద్ర లేదయ్యెను. ఒక్కటే యాందోళన మయ్యెను. వేఁడి చేయదా? జరుగవలసిన దేలాగునన్నైన జరుగక తప్పదని నిశ్చయించుకొని యెప్పుడు గూడ నేదో కడుపులోఁ బడవైచుచుండవలయును గాని మానఁగూడ దమ్మా! కాని యీసరి కాతఁడు రావలసినది కదా యింక నేల రాలేదో?

గుణ—ఆతని రమ్మని చెప్పవలదని నీతోఁ జెప్పియుండలేదా? ఆయనతో నే నొంటరిగ మాటలాడితిననుమాట నాకుఁ దెచ్చుట ధర్మమా?

కుర—ఒంటరిగ నంటివేల? నిన్నుఁ బెంచి, పెద్దదానిని జేసి తల్లితో సమానమైన నేను నీయొద్ద నుండనా?

గుణ—ఉందువులే. కాని యాతఁ డింక నెందులకు రాలేదో?

కుర—కారణ మేమియుఁ జెప్పలేకుండ నున్నాను.

గుణ—వచ్చును గద?

కుర— రాకుండునా? ఇప్పుడే వచ్చునమ్మా

గుణ— పోనీ వచ్చినప్పుడే వచ్చును. తొందరపడుట ధర్మమా? నిష్కారణము చెప్పితిని సుమా. పాపము! చిన్నవాఁడు. పొరుగూరనివాసము. రాత్రివేళ. ఆయన యెంత శ్రమపడునో? ఒకరికి శ్రమ మిచ్చుట తగునా? ఆయన నాకొఱకు రావలసినదా? ఎంతమాట!

కుర— నీకొఱకే యాయన రానక్కఱలేదమ్మా. ఆయనకొఱకే యాయన వచ్చును.

గుణ— ఆయన కంతదయ యుండవలెను. నాభాగ్య మట్లు పండవలెను. కురవకా! నాకుఁ దల నొచ్చుచున్నది. రవంత సేపు విశ్రమింపవలయునని యున్నది.

కుర— అభ్యంతర మేమి? ఈపూలపానుపుపైఁ బండుకొనుము.

గుణ— (పండుకొని) నిద్రవచ్చుచున్నట్లున్నది. ఆయనవచ్చునెడల నన్ను నిద్రనుండి లేపుమా. ఆయన నిలువఁబడఁగ నేను బండుకొనియుండు నపచారము నాకు రానీయకుమా!

కుర— అట్లే.

గుణ— ఇదివఱకుఁ బెండ్లిచేసికొన్నవారు నావలెనే యింత యాందోళన పడియుందురా?

కుర— అది పెండ్లికూఁతుల తత్త్వమునుబట్టి యుండునమ్మా. క్రొత్త మగనిమీఁద, క్రొత్త యావకాయమీఁద వాంఛ

మట్టున కఁదళి కొక్కటిగనే యుండును. కాని యీ వాంఛవలనఁ గలుగుసుఖాసుఖములు భేదముగా నుండును. మిసుమంతయు నొక్కటే కదా - కాని వాసెనకుడుము వేరు. రొట్టె వేరు. గారెలు వేరు. దోసెలు వేరు. వట్టి వడియములు వేరు. ఇట్లే వాంఛ యొక్కటేయైనను ద్రవ్యభేదములఁబట్టి యనుభవభేదము లుండును. నా మట్టునకు నాకుఁ గ్రొత్తమగఁడు వచ్చినప్పుడు, వచ్చినట్లు లేదు; వెళ్లినట్లు లేదు. కడుపులో రవ్వంత కదలిక లేదు; మనస్సులోఁ గాసంత చలనము లేదు. వాఁడు పెట్టిన వరియాకంచుకోక మీఁద నున్నంతభ్రమయైనను వానిపై లేదు. ఏది? కన్నతీపుగాడిదకొడుకుమీఁద నా కిట్లేష్చె నది. ఇది గాక - అదేమి? అప్పుడే నిద్రపోవుచున్నదే! పాపము! అంతమజ్జిగఁ ద్రావుమమ్మా యని బ్రతిమాలిన నైన నవాల్హ్వానిసది. నకనకలాడుచుఁ గడుపు పెట్లున్నదో! పదునాలుగేండ్లపడుచు. అదియిది యనక కంటఁబడిన దెల్లఁ గబళింపవలసినదినములే - నే నీయీడులోఁ బల్లిక తట్టెఁడు పనసతొనలఁ దిని, దాఁకెఁడుమజ్జిగఁ ద్రావెడు దానను. గురగుర లేదు - మొరమొర లేదు. ఇప్పటి పిల్లలకు వంటయింటి దేవులాటకంటెఁ బడుకటింటి దేవులాట హెచ్చు. కడుపు నిండినతరువాతనే కదా కన్నులనిండు. బెంగచేత నప్పుడే యీపిల్ల సగమై పోయినది. ఇఁక నా యయ్య-పెండ్లికొడుకయ్య - పుష్టిగా, గుమ్మటములాగున,

గుమ్మడిపండులాగున నున్నాఁడు. దినమునకు మూఁడు భోజనములు, అయిదు ఫలాహారములు కానిచ్చుకొని యూరనున్న వింతలన్నియుఁజూచి యింకనేదియుఁ బనిలేక పోవునప్పుడు మాయొద్దకు వచ్చును. అతఁడే నామనసునకు నచ్చినవాఁడు. ఆలాగునఁ బ్రవర్తించుటయే యీ కాలమునకు, నీతత్త్వములకు మంచిది. కాని కుట్టిది క్షణక్షణము దిగనాఁటిపోవుచున్న దనియే నేను మొత్తుకొనుచున్నాను. ఆతఁడు త్వరగ వచ్చి, యదియిది రవంత చూచి, యొడలు తగిలి తగులనట్లుగ దరిఁజేర్చుకొని 'నీకేమియు భయములేదు. నేనున్నా' నన్నముత్తెమంత మాట యనునెడల పిల్లది వెంటనే తేలును. ఈమె యెప్పుడు లేచునో, యెప్పు డిల్లు చేరుదుమో యని భయముగా నున్నది. ఏదీ—ఈతఁడు వచ్చినపిమ్మట గదా. ఏమైననుసరే ద్వారము నొద్దకుఁ బోయి పిలిచెదను. (అట్లు చేసి) ఓమహారాజపుత్రా!

(నేపథ్యమున)

వచ్చుచున్నాను.

కుర—గొప్పపనియే చేయుచున్నావు.

(చంద్రశేఖరరావు ప్రవేశించును.)

బాబూ! ఇంత యాలస్య మేలచేసితిరి? మే మెంతసేపటి నుండియో కనిపెట్టికొనియున్నాము.

చంద్ర—ఒక్కనిముసమైన వ్యత్యాసములేకుండ నీవు చెప్పిన వేళకే సరిగ వచ్చినాను. మీరు చాల ముందుగ వచ్చి నాకొఱకు వేచియున్నందులకు విచారించుచున్నాను.

కుర—పెండ్లికూఁతులపనులు గడియారమునుబట్టి నడపు కొందురఁటయ్యా! గడియారమున కేమి? తొందర లేకుండ-నొకుకు లేకుండ నది తాజుగా నడచును. మా రాణి మనస్సట్లు నిస్తంద్రముగ నిస్సంభ్రమముగ నుండఁ గలదా? పెండ్లికూఁతువ్యాపారములలో మధ్యాహ్న మనఁగ నుదయము. అర్ధరాత్ర మనఁగ దీపాలవేళ. ఎల్లుండి యనఁగా రేపు. విందారగింపఁబోవువాఁ డొక గంట ముందుగాఁ భోజనమందిరమునకుఁ బోవునే-ప్రయాణ మేగువాఁడు బండి యింక నరగంటకు వచ్చు ననఁగా శకటశాలయొద్ద నీడ్గిలఁబడి యుండునే-పరీక్షకుఁ బోవుబాలుఁ డొకపావుగంట ముందుగాఁ బరీక్షస్థానము నకుఁ బోవునే-కొంగులకు ముళ్ళువైచికొని శాశ్వతముగా సుఖపడవలసినయీశృంగారవ్యాపార మూరికేఁ బోవు టంతమాత్రము చేయ లేదయ్యా?

చంద్ర—అయిన దనుకొన్నయాలస్య మేదో యైనది. శుష్క వాక్యములతో నింక నాలస్య మేల చేసెదవు? మీరాణి యేది? కనఁబడ దేమి?

కుర—ఎదుటికి వచ్చి యర్ఘ్యపాద్యము లిచ్చి రావయ్యా పెండ్లికొడుకా యని తీసికొనిపోయి ప్రక్కలోఁ గూర్చుండఁ

బెట్టుకొను ననుఁ గొంటిరా? మీ మందగమనములు, మీమర్యాదలు, మీమహారాజాధికారము లెవరియొద్ద నైన నగిపఱుపవచ్చుఁగాని పెండ్లికూఁతునొద్దఁ గనఁ బఱుచుట ధర్మమా?

చంద్ర—మనసు గ్రహింపకుండ మాటలాడెద వేల? రాణి యేది యని యడుగ న న్నామెయొద్దకుఁ దీసికొనిపొమ్మని నాయభిప్రాయముకాని యామె నాయొద్దకువచ్చి నన్నుఁ జంకనెత్తుకొని తీసికొనివెళ్ళినది కాదేమని నాయభిప్రాయమా?

కుర—అటులైన నావెంట రమ్ము. అదిగో! ఆపుష్పనికుంజములో మంచముపైఁ బండుకొనియున్నది. లేపెదను. మీరు మాటలాడుకొనుడు.

చంద్ర—ఇప్పుడు పండుకొన నేల?

కుర—రాత్రిభాగము పండుకొనరాదని ధర్మశాస్త్రమున్న దేమో నే నెఱుఁగనయ్యా! ఏల పండుకొనెనో లేపెదను. ఆమెనే యడుగుము.

చంద్ర—నిద్ర లేపవలదు. ఆమె లేచువఱకు నే నిచ్చటనే వేచియుందును.

కుర—ఇక్కడ నేల? మంచమునొద్దనే కూరుచుందురుగాని రండు.

చంద్ర—నీయిష్ట మెటులో యట్లే.

కుర—అదిగో! చూచితిరా? (పైఁట తిన్నగ సర్దుచున్నది. పైఁటకొంగు గుండెలపైఁ గప్పుచున్నది.)

చంద్ర—ఉన్న దున్నట్లుండనీ. నీసర్దుబాటువలన నామెకు నిద్రాభంగ మగునేమో?

కుర—ఉన్నయొక్క పీఠముమీఁద మీరు గూరుచున్నారు. మీ రామెప్రక్కలోఁ గూరుచుండరాదా? నేను మీ పీఁటపైఁ గూరుచుందును.

చంద్ర—ఆమె నిదురించుచుండఁగా నిక్కడఁ గూరు చుంటయే తప్పేమో యని భయపడుచుంటిని. ప్రక్కపై నేను గూరుచుందునా? నీవు కూరుచుండి యామెకు నిష్ఠ శముగ విసరుము.

(తనలో)

తే. గీ. ఎడమయరచేయి కడుపుపై । మడఁచి యుంచి
తలను గుడివై పొరగఁజేసి । దక్షిణంపుఁ
జేతివ్రేళులు గుడిచెక్కుఁ । జేరనిచ్చి
వెలికిలనుబండుసొగ సెంతొ । తెలియువశమె?

ఆ॥ వె॥ ముద్దుటుంగరాల । ముంగురుల్ కురవక
చేతిగాలివలనఁ । జెదరి యదర
నిట్టినుందరాంగి । యిలను లేదని తల
నడ్డముగను నూఁపు । నట్లు తోఁచె.

తే॥గీ॥ శ్వేత మగుగుండ్రనితలాడ । శిరముఁ జేర్చి
పవ్వళించినవిమోము । భాసురాంగి
చల్లనై యుత్కృష్టమై । సౌరుమీఱుఁ
బృథులపరివేషయుతచంద్ర । బింబ మట్లు.

(గుణవతి నిద్రలో నవ్వుచున్నది.)

ఆహా! అది యేమి? ఎంతచక్కఁగ నవ్వుచున్నదో!

పెదవులు రవంత వీఁడగ । రదనరుచులు
చెక్కులగులాబులకును డీ । డిక్కొనఁగ
మధురమగునూర్పురుచి మెడ । మల్లెపూలఁ
జెనక నవ్వొ గుల్లబు విక । సించినట్లు.

కుర — బాబూ! చూచితిరా! ఆమె యెట్లు నవ్వుచున్నదో! "ప్రక్కమీఁదఁ గూరుచుండుమన్నఁ గూరుచుండఁడు; కుర్చీలోఁ గూరుచుండి కునికిపాటులు పడుచున్నాఁడు; ఇతఁ డెక్కడి పెండ్లికొడుకయ్యా" యని యామె నవ్వుచున్నది.

చంద్ర — అట్లు కాదు. "దీని కెన్నియేండ్లు వచ్చినవి? క్షత్రియాంతఃపురమున నెంతకాలమునుండి కొలువు సేయుచున్నది? ప్రభువులతో నెట్లు మాటలాడవలయునో యిప్పటివఱకుఁ దెలియదు లేకున్నదే" యని నవ్విన దనుకొనరాదా? కురవకా! లేక - ప్రక్కమీఁదఁ గూరుచుండి యామెను స్పృశించుట కింతయవకాశమున్నను నందు

లకై నీ వెంతప్రోత్సహించుచున్నను నీతఁ డెంతనీతిమంతుఁడో యెంత యుత్తమమనస్కుఁడో యనువింతచేత నవ్వుచున్నదేమో యని యనుకొనరాదా ? కురవకా ! అదియు నసత్యమే, యిదియు నసత్యమే. నవ్వునకుఁ గారణమును వారివారిహృదయవైఖరినిబట్టి గ్రహింతును.

తే॥ గీ॥ సర్వకౌరవనాశక । జన్యమునకు
మూలకారణ మయ్యెఁ బాం । చాలినవ్వు.
ప్రాణమునకంటెఁ బ్రాణమౌ । భ్రాతయందు
రామున కపోహ నవ్వుచేఁ । బ్రభవమొందె.
సరసమగునవ్వు జగతికి । సౌఖ్య మొసఁగు
విరసమగునెడ జగతికిఁ । బీడనిచ్చు
భార్య పరదేవతయె గుణ । వతియె యైన
నన్యయగునెడ రాక్షసి । యగును బతికి.

ఇఁక వికటమగునవ్వు మిగులఁ జెడ్డది.

అగ్నిఁ గాలిన దెబ్బైన । నారిపోవు
పోన దగ్ధము జ్వలియించు । ననవరతము
బాఁకుపోటుననౌ పుండు । బాగుపడును
నవ్వుచేఁ బుట్టుగాయంబు । నయము గాదు
నవ్వుచేఁ గొన్ని రోగముల్ । నాశమొందు
నవ్వుచేత దీర్ఘాయువు । నివ్వటిల్లు
నవ్వుచేతనే పూర్వజ । న్మంబు గలద
టంచు మనవారు వెనుక సా । ధించినారు

కాని వీనిలో సత్యంబు । గలదటంచు
విశ్వసించుట దగ దంచు । విన్నవింతు
మేదినికి నవ్వుచేసిన । మేలుకంటె
నపకృతియె నూరురెట్లు హా । చన్చి తలంతు.
జగతి దుఃఖమయంబౌట । జనులు కొంత
సేపయిన నేడ్వ నూనఁగఁ । జిత్రహాస్య
రచనలను గ్రంథము ల్కావుల్ । వ్రాసినారు
పైన నూఁదినఁ బోవునే । వాతమంట.

కుర—బాబూ! పండినగడ్డమున కర్హములైనసిద్ధాంతములను నూన్నూఁగుమీసములతోఁ జేయుచున్నావు.

చంద్ర—సిద్ధాంతము లని చెప్పలేదు. ఎవరియభిప్రాయమును వారు ప్రకటించుట కర్హులు కారా?

కుర:—కాని నాయభిప్రాయమును బ్రకటించినందులకు మీరు నన్నుఁ జీవాట్లుపెట్టినారు. మీయభిప్రాయమును గాదనఁగలవా రెవ్వరు? గాజురాయియైనను బంగారు జవఁ జేరి వజ్ర మగును. హీరమైనను వెండిని జేరి గాజురాయి యగును. ప్రధానమైనసంగతి నుపేక్షించి పైసంగతులు మాటలాడుచున్నాము. మహారాజపుత్రా! ఆమె మూడుదినములనుండి శుష్కోపవాస మొనర్చుచున్నది. నిద్రాశూన్యయై యున్నది. మీకొఱకు మిగుల నాందోళన మొందుచున్నది. ఇంతకుముందు కాసంత తలనొప్పి యని చెప్పినది. ఒడలు వేఁడిగా నున్నట్లున్నది.

చంద్ర—అత్యాయాసమొందిన ప్రకృతి గాటముగ సొమ్మసిల్లి యున్నది. నిద్ర లేచినవెనుకఁ జూచుకొందము. ఈనిద్ర యామెకు మంచిది.

గుణ—మహారాజపుత్త్రా! మహారాజపుత్త్రా!

కుర—అయ్యయ్యో! అమ్మ పలవించుచున్నది. ఏమి చేయుదునమ్మా! ఎప్పుడు నిట్టి దెఱుఁగ దమ్మా!

చంద్ర—కురవకా! తొందరపడి లేపకు.

తే॥ గీ॥ ఏను రాజేంద్రపుత్త్రుఁడ । నైన నేమి?
ప్రాణనాయికా! భవదీయ । భటుఁడ సుమ్ము
చక్రవర్తియు దాసుండు । సతికి నెపుడు
సురపతియునైన సతికిఁ గిం । కరుఁడు సుమ్ము.

అజుఁడు భార్యను ముఖమున । నద్దుకొనియె
విష్ణుఁ డాలిని ఱొమ్ముపైఁ । బెట్టుకొనియె
దక్షపుత్త్రికి శివుఁ డర్ధ । తను వొసంగె
భార్యయాధిక్య మెంతొ చె । ప్పంగవశమె?

వంశవృద్ధిచేఁ బూర్వపు । వారు సుగతిఁ
బొందుటకునె గార్హస్త్యంబుఁ । బూనవలయుఁ;
గానిశారీరకంబైన । గ్రామ్యసుఖము
ననుభవించుట కిసుమంత । యైనఁ గాదు.

తండ్రిగారిపేరును నాఁడు । తాతపేరు
కన్నబిడ్డల కిడుకొను । కాంతచేత

నములినగుణాఢ్య వైనని । న్ననుసరింప
వచ్చితిఁ, గడమవిద్వతీయ । పక్షమునఁబల!

కుర—ఇంతచిన్నవాఁడవే బాబూ! ఎంత వైరాగ్యసంపన్నుఁడవై ప్రకాశించుచున్నావు? నడుమనడుమ నీమాటలు చూడఁగా నాకాశ్చర్యమగుచున్నది.

చంద్ర—ఆశ్చర్య మక్కఱలేదు.

తే॥ గీ॥ అతులవైరాగ్యవిజ్ఞాన । యుతుఁడుతండ్రి
యులయురుంధతి కెనయైన । దమ్మ నాకు;
గుణ మొకటియైనఁ గలుగదే । కొదమసింగ
మునకు నడకకీవియునైనఁ । బొనఁగకున్న?

గుణ—నిన్నుఁ గూర్చి నా కేమియుఁ దెలియకున్నను నిన్నుఁ జూచుటతోడనే గాటముగా వలచితిని. పూర్వజన్మసంబంధమువలననే యీ యసాధారణానురాగ మింతయాకస్మికముగాఁ గలిగినదని యనుకొంటిని.

చంద్ర—బుద్ధిమంతురాలవు. అదియే నిశ్చయము.

తే. గీ. ముందుఁ బడఁబోవుముడి మన । పూర్వభవము
లందె పడియుండుటచే మన । మిందు నిట్లు
తారసించినారము దైవ । తంత్రమిద్ది;
పురుషయత్నంబున ఫలంబు । పొందుపడునె?
అందఱును సుందరాంగియా । నాలిఁ గాంచ
వలయునని గాఢయత్నముల్ । వలుపుచుండ

నప్రయత్నముగను సిద్ధి । నందుటందు
నీశుకృపగాక మఱియొక్క । టేమి గలదు?

ఇట్టు లది యట్టు లిది యిట్టు । లిద్ది జరుగఁ
దగుననుచుఁ గాలసారస్వ । తంబునందు
వ్రాయఁబడియుండు; దానికి । వైపరీత్య
మెన్నఁడును లేదు లేదు లే । దింతయైన.

జగతి చదివినచదువునే । చదువుచుండు
వ్రాసియుండిన వ్రాఁతనే । వ్రాయుచుండు
చేసియుండినచర్యనే । చేయుచుండు
జగతిగతియె పౌనఃపున్య । మగును గాదె?

సృష్టిలోపలఁ గ్రొత్తది । యెదియు లేదు
మఱలమఱలగ నవ్వియే । తిరుగుచుండు
ప్రాఁతదే క్రొత్తదంచును । భ్రమపడుదుము
కారణము బుద్ధిహీనత । కంటెఁ గలదె?

కుర—భార్యప్రక్కలో భగవద్గీత లెందులకు బాబూ! ఏవో నాల్గుకళాశాస్త్రపుమాట లాడ రాదా?

చంద్ర—భార్యాభర్తలు పశువులను నభిప్రాయము నీవు విడుచునప్పుడు నామాటలు నీవు మెచ్చుకొనవచ్చును.

గుణ—నిన్ను రమ్మని నే ననఁగలనా? నీవు పిలువకుండ రావు. పోనిమ్ము మహాప్రభూ! మనస్సులకలయికయే చాలును.

కుర—పిలిచినప్పుడు మాత్రము పెందలకడ వచ్చినాఁడా?
అదియు లేదమ్మా!

చంద్ర—సెబాస్! గుణవతివి. సద్గుణవతివి. మహాగుణవతివి,
నీహృదయమును విప్పి చూపుచున్నావు. నీవు మేల్కొని
యుండినయెడల నింతవిస్పష్టముగ మాటలాడుదువా?
సిగ్గుకొంకు, శ్రోత్రేదనము మొదలగునవి మనస్సు
నాచ్ఛాదించియుండును. నీవునిద్రించుటయే నేను దాతా్క-
లికాదృష్టముగ భావించుచున్నాను.

ఆ. వె. కల్లుద్రావువాఁడు । గాఢనిద్రనుజెందు
నతఁడు సన్నిపాత । యుతుఁడు నప్పు
డాడుమాట లన్ని । యాథార్థ్యసహితంబు
లంచు విశ్వసింప । నగును దలఁచు.

గుణ—రాజేంద్రా! వచ్చుచున్నావా? మహానందము. అర్ఘ్య
పాద్యము లిచ్చెదను. మహానుభావా! గ్రహింపుము.
(లేచి కన్నులుమూసికొని కూరుచుండును.)

కుర—అమ్మా! అది యేమి? మెలఁకువ తెచ్చుకొనుము.
(అని వీఁపు చఱచి చేయిపట్టుకొనును.)

గుణ—(కన్నులు మూసికొని) వచ్చితివా? ప్రాణనాయికా!
వచ్చితివా? ఇఁక నెన్నఁడు విడిచిపోకుమా? నేను నిన్ను
వదలియుండఁగలనా? (కురవకను గాఁగిలించును.)

చంద్ర—కురవకా! ఏమియుఁ దొందరపడకుము. ఒక్కనిముసమునకు మెలఁకువ వచ్చును. (తనలో)

తే. గీ. అకట! నాకు రాఁదగినభా । గ్యంబు దాసి
కయ్యె; నైనను ఫలమేమి । యనుభవించు?
నర్హతయె లేనియపుడు భా । గ్యంబు లేల?
పండివా ల్లెల మందాగ్ని । బాధితునకు?
నెలఁత! దాసిని దరిఁజేర్చ । నీదుచేతి
బిగియుఁ బట్టును దాసికి । మిగిలెఁ గాని
జల్లుమని మది పులకలు । వెల్లివిరియు
నట్లుచేయుమహానంద । మంత మాది.

కుర—రాజేంద్రా! నాకు భయముగా నున్నది. మెలఁకువయింక రాలేదు. మీ రొకసారి యామెను వీఁపుపై జఱచిలేపుఁడు. నాచేతు లీమెను గౌఁగిలించియున్నవి.

చంద్ర—ప్రాణకాంతా! ఇంత యసందర్భముగఁ బ్రవర్తింపవచ్చునా?

ఆ. వె. అనుభవింపవలయు । నర్హుఁడ నేనుండ
దాసిఁ గౌఁగిలింపఁ । దగునె నీకు?
చెఱకుముక్క పండ్ల । చేవగల్గినవాని
కగునుగాని బోసి । యతని కేల?

అపాత్రత్యాగ మొనర్చుట తప్పుకాదా? (ఆమె చేయి పట్టుకొని లాగును.)

గుణ—(కన్నులు దెఱచి) ఆ! ఆ! ఎవరు? ఎవరు? (చేయి విదల్చుకొని కురవకను జేరును.)

చంద్ర—ఎవ్వఁడనా?

తే. గీ. ప్రథమదర్శనమందె యీ । శ్వరునికరుణ
నెవఁడు మోహించి కనుఁ దపి । యించినాఁడొ
యెవఁడు ధర్మపత్నిగను గాం । క్షించె నిన్ను
నట్టినీవాఁడె నిన్నుఁ జే । పట్టువాఁడె.

గుణ—కురవకా! నీవు నాయొద్దనే యుండియు నామహారాజ పుత్రుని నన్ను స్పృశింపనిచ్చితి వేల?

కుర—ని న్నాతఁడు స్పృశించునని నాకుఁ దెలిసినయెడల నేనిక్కడనుండి యింటికే పోయియుందు నమ్మా!

గుణ—ఆఁ ఆఁ. నన్నీయనతో విడిచి నీవు పోవుటకు సాహసింతువా?

కుర—సాహసింపక యేమిచేయుదును? మగఁడు పెండ్లాము దగ్గఱగా నున్నప్పుడు నే నెంతతలనఱసినదాన నయ్యును నాయొడలు పులకరింపక మానదమ్మా!

చంద్ర—(తనలో) ఇంత సిగ్గుమాలినముండను జూడలేదు. ఎట్టిదైన నేమి? నాకు మహోపకారిణియైనది. ప్రపంచ వస్తువులలో నిది నీచము నిది ఘనమని యెవరు చెప్పఁ గలరు?

గుణ___అసందర్భప్రలాపము లాడుచు నన్నుపహసించు చున్నావు. నన్ను వరించినవాఁడైననేమి? నేను నిద్రావస్థయం దున్నప్పుడు నన్ను స్పృశించుట ధర్మమా? కురవకా! ఇది నీప్రోత్సాహమున జరిగియుండును. నీవు నాయెడ భయభక్తులు లేకుండఁ బ్రవర్తించితివి.

చంద్ర___సరే_ప్రాణనాయికా! కురవకయే ప్రోత్సాహమొన ర్చిన దనుకొనుము; నాయిష్టమునసనే స్పృశించితి నను కొనుము. నావస్తువును నే నంటుట నాకుఁ దప్పులే దను కొందును. తప్పైనయెడల మన్నింపుమని వేఁడుచున్నాను. నిద్రావస్థలో నిన్నుఁ దాఁకుట ధర్మముకాదని చెప్పినందు వలన జాగ్రదవస్థలోఁ దాఁకుట ధర్మమని నీవే యభిప్రాయ పడినట్లు స్పష్టము గావున నిదిగో! వచ్చుచున్నాను.

సీ. నిదురలో జడచుట్టు । చెదరినదిసుమంత
సరిచేయనిచ్చెదో । సారసాక్షి
ప్రక్కలో నల్గెను । పైఁటకొంగు రవంత
ముడుతలు తీర్తునా । ముద్దుగుమ్మ
ఒడ్డాణమునఁ బువ్వు । మొకవంక కొరగెను
నడిమికిఁ జేర్తునా । నళిననేత్ర
కుచ్చిళులొగుడుది । గుడుగాఁగ నున్నవి
సర్దించుకొనరాదె । జలదవేణి

నీదు వ్రేళులు కుడిచెంప । మీఁద నొత్త
నొక్కు లెత్తఁగఁ బడియున్న । వొక్కమాఱు
నిమ్మళంబుగ నిమురంగ ని । మ్మనుజ్ఞ
చారుశారదపూర్ణిమా । చంద్రవదన!

కుర—(అపవారించి) అమ్మా! చిన్నవాఁడమ్మా! కోటలో గోవగాఁ బెరిగినాఁడమ్మా! ఆమాత్రముబలాట ముండవలసినదే. మందముగా నున్నాఁడేమో యనుకొంటిని. ఇఁక భయములేదు. నీవు సందేహింపక యంగీకరింపుము.

గుణ—ప్రభుకుమారా! మీ కుపచారములుచేయుట నాకు విధి. మీ రటుపలుకుట న్యాయముకాదు.

చంద్ర—అది మఱింతమంచిది. సర్వోపచారములు చేయించుకొనుటకు సర్వసన్నద్ధుఁడనై యున్నాను. ఏది? కానీ.

తే. గీ. ప్రతిభగలశిష్యునకు విద్య । వచ్చునట్లు
పరమసుగుణాఢ్యునకుఁ గీర్తి । వచ్చునట్లు
భవ్యతపసి కీశ్వరుదయ । వచ్చునట్లు
ప్రాణసఖి! రమ్ము నాబాహు । బంధమునకు.

ఆఁ. సందేహించుచున్నావా? అంతపని చేయలేవా? పోనీ. ఇట్లు చేయఁగలవా?

తే. గీ. రమ్మనుచుఁ బిల్చినప్పుడు । రాక యేల
యింతయాలస్యమనుచుఁ గా । నంతప్రణయ

కోపమున బుగ్గపోటు చే । కూర్పరాదె?
యొడలు జల్లుమనఁగ ధ । న్యుండనౌదు.

కుర—(అపవారించి) అమ్మా! ఆయనయొద్దకుఁ బొమ్ము. ఎంతయో యుత్సాహపడుచున్నాఁడమ్మా! మగవారి యుత్సాహము తాటాకుమంటయమ్మా! ఆలసింపకు.

గుణ—నీ కెందులకు? నీ పూరకుంభము. బాలప్రభూ! నే నట్టియుపచారము లొనర్పఁదానను గాను. కురవక నీతోఁ జెప్పినమాటలఁబట్టి శ్రమపడి యీయుద్యానవనమునకు వచ్చి నన్ను ధన్యాత్మురాలిని జేసితివి. నీవు వచ్చువేళ నాదురదృష్టవశమున నేను నిదురించుచుంటచే నీ కర్హమైనసత్కారము లెవ్వియుఁ జేయలేకపోయితిని. క్షమింపవలయును. బీదవార మైనమాయింటికి వచ్చుటలో మీకరుణోదారస్వభావము వెల్లడియైనది.

చంద్ర—నీవలన నేను భాగ్యాన్వితుఁడను గావలయునని నే నపేక్షించుచుండ మీరు బీదవా రెట్లగుదురో నాకుఁ దెలియదు.

తే. గీ. భాగ్యవంతుఁడు ధనమున్న । వాఁడు కాఁడు
ధనము లేనట్టివాఁడు బీ । దయును గాఁడు
భాగ్యము నభాగ్యమును సొమ్ముఁ । బట్టి కాదు
మనసుఁబట్టియె యవి యుండు • వనజవదన!

తుష్టిగలవాఁడు భాగ్యవం । తుండు నిజము
పరమసుగుణాలవాలుండు । భాగ్యశాలి
స్వార్థరహితుఁడు పరమభా । గ్యాన్వితుండు
భక్తిగలవాఁడు సంతత । భాగ్యయుతుఁడు.

విద్యగలవాఁడు భాగ్యాన । పద్యుఁ డగును
సౌభాగ్యయగుభార్యగలవాఁడు । భాగ్యయుతుఁడు
దానతతిఁబట్టి కానుల । రాసిఁబట్టి
భాగ్యమును నిర్ణయించుట । పాడికాదు.

ప్రాణప్రియా! అందువలన నీవు చెప్పినబీదతనము నీకు లేదు. అదికాక నిజముగా మీరు బీదవారు కారు. దీని కేమి కాని "ప్రాణప్రియా! ప్రాణకాంతా!" యని నిన్ను నేను బిలుచుచుండ నీవు నన్ను "మహారాజపుత్రా! బాలప్రభూ!" యని సంబోధింతు వేల?

గుణ — అంతమాట యొక్కసారియనుటకు సిగ్గుగా నుండదా? క్రమముగా నందును.

చంద్ర —

తే. గీ. క్రమముగా సిగ్గు విడుచుట । కటికికల్ల
తలుకునను వీడ వెంటనే । తఱలిపోవు
సేతువున గంగ స్నానంబు । చేయునాతఁ
డెగిరిపడవలె మెలమెల్ల । దిగఁగఁదగునె?

నీ వాసిగ్గును వీడలేనప్పుడు - అది నీకు నాకుఁ గూడ నభ్యంతరముగా నున్నప్పుడు—దానిని బాఱఁద్రోలుట నావిధి కాదా?

(గుణవతి బుజమునఁ జేవ్రైచి దగ్గఱకుఁ దీసికొనును.)

గుణ—ఆఁ. ఆ!

చంద్ర—ఆఁ వలదు. ఈఁ వలదు. చూచితివా సిగ్గెగిరి పోయినది? తిరిగి రాకుండ నే నిక్కడఁ గాపుందును. అట్లు వదల్చుకొనుటకుఁ బ్రయత్నించుచున్నావా? నీవు నాపట్టు తప్పించుకొనఁగలవా?

గుణ—కురవకా! నే నీయనను వదల్చుకొనలేకుండ నున్నాను. నే నీవలకు వచ్చుటలో నాకుఁ గొంతసాహాయ్యము నీవు చేయరాదఁటే? రాక యట్లు చూచెద వేమి?

కుర—నావలనఁ గాదమ్మా! నే నేభార్యాభర్తలకెడఁబాటు కలుగఁజేసితినో కాని రంగూనువెళ్ళినమగఁడుముండకొడు కింక వచ్చి మొగముచూపినాఁడుకాఁడమ్మా!

గుణ—ఆఁ. నాకుఁ జేయి నొప్పిపెట్టుచున్నది. (వదలుచు కొనును.)

కుర—అమ్మా! యిదిగో! మాలతీమాల. ఇది నీభర్తమెడలో వేయుము.

గుణ—(అట్లుచేయును.)

చంద్ర—ఇంతపెద్దదండ నా కొక్కని కేల? ఇది యిద్దఱకు సరిపోవును. (దండలో నామెమెడ దూర్చి బుజమునఁ జేవైచి)

తే. గీ. పూతత నొసంగునోవంశ । పురుషులార!
తనువు నిచ్చినయోతలి । దండ్రులార!
సతతదయనిచ్చునోసహ । జన్ములార!
ఈమెను గ్రహింతు సెల వంద । జేయరయ్య!
ఇదిగో! మాలతీమాల బం । ధించె మమ్ము
నిద్దఱకు శరీరమొకటె । యిద్దఱకును
బ్రాణ మొక్కటె యిద్దఱ । కాత్మయొకటె
శాశ్వతపుబంధ మిది; యిదె । యీశ్వరేచ్ఛ.

తే. గీ. సాధనము పేశలం బని । శంకవలదు
మృదులమగు త్రాటికే బిగి । యింపుహెచ్చు
రక్తమునకంటె మృదుతర । ద్రవ్య మేది?
రక్తసంబంధమునకంటెఁ । బ్రబల మేది?

ఆహా! సమయమునకే యీలతానికుంజము మనపైఁ బారిజాతపుఁబూలు వర్షించుచున్న దే! ఓనికుంజపారిజాతలతలారా! మీ యభినందనములు శిరసా గ్రహింపఁబడినవి.

తే. గీ. మీకు రాగాదికంబులు । మాకువలెనె
యులరుటను బట్టి మామెడ । సానుభూతిఁ
గనఁబఱచినారు నోరున్న । కరుణకంటె
నోరుమాలినప్రేమ గం । భీరతరము.

ప్రభునిఁ గని యుపన్యాసపా । రస్యమొలుకఁ
బ్రజ లొసంగు నాశీర్వచః । ప్రతతికంటె
గొల్లనిం గాంచి యుప్పొంగి । కుక్క తోఁక
కదలుచుటయుండె సత్యమా । కరుణ గలదు.

గుణ — మీతల్లిదండ్రు లీసంబంధమున కంగీకరింతురా?

చంద్ర — నేను నిన్నుఁ గాంచినరాత్రియే మానాయనగారి
నమ్మగారికి నిన్నుఁగూర్చి వార్తనంపితిని. వారీసంబం
మిదివఱ కెఱుఁగుదుమనియు నాకిష్టమగు నెడలఁ ద
కిష్టమే యనియుఁ బ్రతివార్త నంపినారు.

గుణ — సంతోషము.

చంద్ర — ప్రాణకాంతా!

తే. గీ.। మనదుశ్శృంగారనాటక । మునకు మూడె
పాత్రములు కథాసరణిలో । పలను గొడవ
యణువయినలేదు ముగిసె నీ । యంక మింకఁ
బరిణయాంకమె యాడంగ । వలయుఁ బైని.

ఆలస్యమైనది కురవకా! రాణిని దీసికొని నీవింటికి
బొమ్ము. నేనును బోయెదను.

గుణ — ఇఁకఁ బెండ్లినాఁడేనా చూచుకొనుట?

చంద్ర — అవును.

గుణ — సెలవా?

చంద్ర—ఊఁ యనుట కంగీకారము కాదు. ఉహూహ్హూనుట యపశకునము. ఏమనఁగలను? శీఘ్రముగఁ బునర్దర్శన మపేక్షించుచున్నాను.

కుర—బాబూ! మీరు మాయింటియెదుట మొన్న రాత్రి నిలువఁబడినప్పుడు మీరు దొంగయేమోయని సందేహించితిని. మాపిల్ల మనసు మీరు దొంగిలించుకొని పోవుట చేత నామాటయే నిజమైనది. నాయంతఃకరణమంత స్వచ్ఛమైన దింకొకటి లేదయ్యా! నమస్కారము.

చంద్ర—పోమ్ము.

(అందఱు నిష్క్రమింతురు.)

ఇది తృతీయాంకము.

శ్రీ

# మా ల తీ మా ల

## చ తు ర్థా ం క ము

విష్కంభము.—ప్రదేశము—పెండ్లియిల్లు.

ప్రవేశము—ఇద్దఱు బ్రాహ్మణులు. సూరయ్య-పేరయ్య.

సూర—ఓహో! సీతా కల్యాణమోయి! సీతాకల్యాణమోయి! ఇంతవైభవయుక్తమైన పెండ్లి నేను జూడ లేదోయి!

పేర—సమారాధనలక్రింద- సంతర్పణలక్రింద- నుత్సవముల క్రింద- నూరేగింపులక్రింద నెన్నిలక్షలు వ్యయమైనవో?

సూర—ఎన్నిలక్షలైనను నైనవే. సొమ్ముమాట నేను జెప్ప లేదుకాని యాపెండ్లియేర్పాటు లున్నవే యవి యత్యద్భుతముగ నున్నవి. ఎంతయాదరణము! ఎంతపరిశీలనము! ఒక్కనికైనఁ గానంతలోపము జరిగినదని చెప్పవీలులేదు కదా! అంతపాత్రత్వచింతతో నంతవిమర్శముతో జరిగినపెండ్లిమాత్రము నేను జూడలేదోయి!

పేర—మహారాజుబుద్ధికిఁ ద్యాగమునకు హద్దు లేకుండనున్న దోయి!

సూర—అది యట్లుంచుము. ఆమహారాజు శాంతిసౌజన్యము మహారాజులలోఁ గాదుకదా చక్రవర్తులలోఁగూడ నెవ్వరి కుండదు.

పేర—పెండ్లికెందఱు బంధువులు-ఎందఱుద్యోగులు-ఎందఱు న్యాయవాదులు- ఎందఱు న్యాయమూర్తులు- ఎందఱు జమీందారులు- ఎందఱు కవులు- ఎందఱు పండితులు- నీవంటినావంటివా రెన్ని వేలు లక్షలు వచ్చినారోయి! దేశదేశాలనుండి వచ్చినారు!

సూర—తలఁబ్రాలసమయమందుఁ బుష్పవృష్టి గురిసినదఁట! నీవు వింటివి కాదా?

పేర—మహారాజు గొప్పభక్తుఁ డఁట! గొప్పజ్ఞాని యఁట! పుష్పవృష్టి గురిసినను గురియవచ్చును. ఆశ్చర్య మెంతమాత్రము లేదు. ఇట్టిమహారాజులు లోకమున నలంకారములు. ఇట్టివారు దీర్ఘాయుస్సంపన్నులై సకలవైభవములతో నుండవలెను.

సూర—తథాస్తు.

పేర—ఇఁక మనము పోవలసిన దేనా?

సూర—ఇఁకఁబదునైదుదినము లున్నను మనకు లోపముండదు. నగరుపెండ్లి యెప్పుడు?

పేర—ఈరాత్రి కాఁబోలు. ఇప్పుడు కోటలో జరుగుచున్న దేమి?

సూర—పెండ్లి పూర్తియైనది కావునఁ బెండ్లికొడుకుఁ బెండ్లికూఁతురు మహారాజదంపతులకు నమస్కరించి వారి యాశీర్వాద మొందుటకు వచ్చుచున్నారఁట.

పేర—అమ్మగారు నయ్యగారే కాదు; ఆంధ్ర దేశమంతయు వధూవరుల నాశీర్వదింపఁదగినదే. మన మిఁక బనకుఁ బోవుదమా?

సూర—సరే.

(ఇద్దఱు నిష్క్రమింతురు.)

ఇది విష్కంభము.

శ్రీ

# మాలతీమాల

## చతుర్థాంకము

ప్రదేశము:—కోటలో నంతఃపురము.

ప్రవేశము:—చంద్రశేఖరరావు, గుణవతి—జగన్నాథ ప్రభుఁడు, అతని రాణి మహాలక్ష్మి—పురోహితుఁడు వెంకన్న.

వెంక—మహారాజదంపతులారా!

సీ. ప్రజ్ఞావిశేషుండు । ప్రతిభాసమేతుండు
పితృవాక్యపాలన । వ్రతయుతుండు
విద్యాధురీణుఁడు । విమలస్వభావుఁడు
ధైర్యసౌందర్య గాం । భీర్యయుతుఁడు
కరుణాంతరంగుఁడు । కంజదళాక్షుఁడు
కవితాప్రియుండును । గానరతుఁడు
సాధుప్రవర్తన । సహితుండు జగదీశ
పాదపద్మాముల । భక్తియుతుఁడు
మీకుమారుఁడు, గొనముల । మేటి యైన
కోడలును మీకు మ్రొక్కుట । కొఱకు నిటకు
వచ్చియున్నారు నూత్నదం । పతులు వీరి
దయను దీవించి పంపరే । ధన్యులార!

గుణ:—చంద్ర:—(మ్రొక్కుచున్నారు.)

జగ:—మహా:—దీర్ఘాయురస్తు. దీర్ఘాయురస్తు.

జగ—పెదనాయనా! మా తపఃఫల మగునీవు పుట్టినతరు వాతనే సంసారవృద్ధియు, సంపద్వృద్ధియు, సంస్థాన వృద్ధియు, సంతోషవృద్ధియు నైనవి. "నాయనా! యిట్లు చేసితి వేమయ్యా" యని యొక్కమాటయైన నేను గాని, మీ యమ్మగారు గాని నిన్ననుట కవకాశ మెంతమాత్ర మును లేకుండునట్లుగ వినయముతో వివేకముతో మా యెడలనేమి, నీసోదరసోదరీమణుల యెడనేమి ప్రవర్తించు చున్నావు. నీ కెంతయో చక్కనిభార్య రావలయునని మే మనుకొనినట్లే దైవకటాక్షమున నీకు లభించినది. నీవు త్వరగ సంతానవంతుఁడ వగుటకై దైవమును బ్రార్థించుచుందుము.

గుణవతీ! దీపమును గాంతివలె—పుష్పమును బరిమ ళమువలె—ఫలమును రుచివలె నీవు నీ భర్తతో నవినాభావ సంబంధముగాఁ గలసియుండి భారతీయపూర్వకాంతల సద్గుణ ముల నలవరచుకొని పుట్టినింటికి మెట్టినయింటికి వన్నెతీసికొని రావలయును,

నాయనా! గృహస్థాశ్రమమునుగూర్చి నాల్గుమాటలు చెప్పెదను.

తే. గీ. భవము సాగర మని బుధు । ల్పలికినారు
దానిలో నున్న మణుల కం । తంబు లేదు.
మృతి నొసంగుజంతువితతికి । మితియె లేదు.
ఘోరబడబానలమునకు । మేర లేదు.

మోక్షమునకు గార్హస్థ్యమే । ముఖ్యపథము
వటుఁడు కడుభీరుఁడై యొడ్డు । పైని గూలఁ
బడి ప్రతాపవాక్యంబు లు । పన్యసించుఁ;
గాని కాలైనఁ బెట్టఁడు । దానిలోన.

ఇంక సన్న్యాసి సంసృతి । వంకఁ జూచి
గడగడవడంకువటువలె । గట్టుమీఁద
హేయముగఁ గూలఁబడుటకు । నిష్టపడఁడు
నీటఁ దడుపఁడు తనకాలి । గోటినైన.

భ్రష్టతకు జంక కన్యభా । వతను గనక
తుళ్ళిపడి యావలికి నొక్క । దుముకు దుముకు
వేఁటకాండ్రను గని మహా । భీతి వడఁకి
చావ నడలక పొదదాఁటు । శశమువోలె.

వారణాసికిఁ బోవుశ । రీరధారి
కాలినడకను మిక్కిలి । గాసిపడుచుఁ
బోయినప్పుడు ఫలమును । బొందుఁ గాని
గాలిగుమ్మటమునఁ బోవఁ । గలదె ఫలము?

ఆత్మరూపుల మగుమన । మలుకు గనక
సంస్కృతిని దిగి యలలను । సరకుగొనక
పట్టిపీఁకెడుజంతులఁ । బాఱఁ దన్ని
భక్తిఁ బూరించి చేబాఱ । వైచుకొనుచు

నాదరికిఁ జేరఁ బౌరుష । మగునుగాదె?
ఆశ్రమంబుల గార్హస్థ్య । మధికతరము.
ఇందులో నేర్చుకొనరాని । వెవియు లేవు.
సర్వసత్కర్మవితతికి । స్థాన మిదియె.

భక్తి కిరవు; జ్ఞానమునకుఁ । బాఠశాల.
హృదయరసముల నెవియు నెం । డింపకుండ
భద్రముగ వాడుకొనుచును । బ్రజలనుగతి
తననుగతికంటె ముందని । తలఁచి చేసి

నీశుధ్యానించుచును బ్రవ । ర్తించెనేని
దీనిచేతనె మనుజుఁడు । దేవుఁ డగును.
ఎవ్వరికినైన ముక్తిల । భించుమాట
సత్య మగునేని యద్ది సం । సారికైన

యతనికి లభించు మొదటనే; । యతనిపిదప
యతికొ వటునకొ ప్రాప్తించు । నభవుకరుణ.
పూతమైనగార్హస్థ్యంబుఁ । బూనినావు
నాయనా! భద్రమూర్తివై । నడవవలయు.

వెంక___ఏమియు లేదు. ఐన నిట్లు కావలయును.

తే. గీ. ధరణి యీతిబాధలు లేక । తనరుఁగాక
ప్రజలయన్యోన్యవైరముల్ । పాయుఁ గాక
కవిత రాజపోషణమునఁ । గ్రాలుఁ గాక
నీతిపాలనమునరాజు । నెగడుఁ గాక.

జగ___తథాస్తు.

ఇది చతుర్థాంకము

శ్రీ శ్రీ శ్రీ శ్రీ శ్రీ

పూర్వరాజాధిరాజుల । పుణ్యగుణము
లనుసరించి శాశ్వతకీర్తి । నందుమయ్య!

వెంక — తథాస్తు.

మహా — నాయనా! మీతండ్రిగారు చెప్పినమాటలకంటె నే నెక్కువఁ జెప్పవలసినది లేదు. మీతండ్రిగారిపరిశుద్ధప్రవర్తనము, వైరాగ్యము, దైవభక్తి సర్వజనశ్లాఘ్యములై యున్నవి. మీతండ్రిగారిని నీవు నీయిల్లాలిగర్భమునఁ గాంచినపిమ్మట నీయందుఁ గుటుంబభారమంతయు నునిచి మేమిద్దఱ మేపుణ్యక్షేత్రమునకో పోయి యచ్చట నొక్కఋషివాటిక నిర్మించుకొని జగదీశపాదారవింద ధ్యానమునఁ గాలక్షేపము సేయుదుము. ఇంద్రునివలె భోగవంతుఁడవై, బ్రహ్మవలె నాయుష్మంతుఁడవై, హరిశ్చంద్రునివలె సత్యవాక్యధురీణుఁడవై, రామచంద్రునివలెఁ బితృవాక్యపరిపాలనతత్పరుఁడవై ప్రకాశింపుము.

వెంక — మహారాజవర్యా! మీ రెంతవిద్యావంతు లయ్యును, మీ రెంతకవితారసగ్రహణపారీణు లయ్యును, ఎంతవిమర్శప్రతిభాసంపన్ను లయ్యును, ఎంతవితరణఖను లయ్యును, ఎంతగుణగణసంపన్ను లైనను నీసర్వలక్షణములందు మీరు మీకుమారునివలనఁ బరాజయ మొందునట్లు నే నాశీర్వదింతును.

శథాస్తు: ఇప్పు డింక నేమి కావలసియున్నది?